





GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 96 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 బుధవారం 18 జూన్ 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్








## యోగాతో ప్రపంచ ఐక్యతా స్ఫూర్తి

**న్యూఢిల్లీ,జూన్ 17సమయజ్యోతి:**

యోగా అనేది కేవలం వ్యక్తిగత ఆరోగ్యం గురించి మాత్రమే కాకుండా, మానవత్వం, పర్యావరణ పరిరక్షణ, ప్రపంచ ఐక్యతా స్ఫూర్తిని నెలకొల్పడానికి కూడా తోడ్పడుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. జూన్ 21వ తేదీన విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఈ మేరకు యోగా దినోత్సవ సందేశంతో కూడిన లేఖను ప్రధాని విడుదల చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలు యోగా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. 'చారిత్రాత్మక యోగా ప్రస్థానం విజయవంతంగా 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మరింత వైభవంగా నిర్వహించుకోబోతున్నాం. గత పదేళ్లుగా యోగా కేవలం భారతదేశంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ చేరువై వారి జీవితాల్లో సానుకూల ప్రభావం చూపుతోంది. అది మనందరికీ గర్వకారణం. ఈ ఏడాది విశాఖపట్నం కేంద్రంగా జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగా.. ఒక భూమి.. ఒక ఆరోగ్యం..' అనే థీమ్‌తో జరుపుకోబోతున్నాం' అని ప్రధాని పేర్కొన్నారు.

## ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులు ఉధృతం

### ఇరాన్ టాప్ కమాండర్

### అలీ షాద్మానీ హతం

**టెహ్రాన్,జూన్ 17సమయజ్యోతి:**

ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య పరిస్థితులు మరింత ఉధృతంగా మారాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచి ఇజ్రాయెల్ భీకర దాడులు చేస్తోంది. తాజా దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీకి అత్యంత సన్నిహితుడు.. ఇరాన్ టాప్ కమాండర్ అలీ షాద్మానీ ప్రాణాలు వదిలారు. షాద్మానీ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ , ఇరానియన్ సాయుధ దళాలు రెండింటికీ నాయకత్వం వహించాడని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. మంగళవారం రాత్రి ఇజ్రాయెల్ సైన్యం జరిపిన దాడిలో షాద్మానీ చనిపోయినట్లుగా ఐడీఎఫ్ తెలిపింది. ఇతడు ఖమేనీకి అత్యంత సన్నిహితుడిగా పేర్కొంది. ఇక షాద్మానీ మరణవార్తపై ఇంకా ఇరాన్ స్పందించలేదు. దీనిపై మరింత సమాచారం అందాల్సి ఉంది. తాజా పరిణామాలు ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తలు పుట్టిస్తున్నాయి. ఏ క్షణంలో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇక కెనడాలో జీ 7 సదస్సులో ఉన్న ట్రంప్ హుటాహుటిన అమెరికాకు వెళ్లిపోయారు. తక్షణమే భద్రతా మండలి సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో ఏదో జరగబోతుందన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఇక జీ 7 దేశాలు.. ఇరు పక్షాలు కాల్పుల విరమణకు అంగీకరించాలని విజ్ఞప్తి చేశాయి.

## కలెక్టర్ పమేల సత్పతిని ఓ రేంజ్‌లో ప్రశంసించిన సీఎం రేవంత్ రెడ్డి

**సమయజ్యోతి జూన్ 17, సమయజ్యోతి:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతిని అభినందించారు. శ్వాస సమస్యలతో బాధపడుతున్న ఆమె ప్రభుత్వ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించు కొని ఇతరులకు ఆదర్శంగా నిలి చారు. ఇది ప్రభుత్వ దవాఖానాలపై ప్రజల్లో విశ్వాసం కలిగించిందని సీఎం అన్నారు. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ కూడా ఆమెను ప్రశంసించారు. కలెక్టర్ గతంలోనూ అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేశారు. ఆమె నిర్ణయం ప్రజా ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేస్తుం దని, ప్రజలు నాణ్యమైన వైద్య సేవలు పొం దేందుకు ప్రోత్సహిస్తుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని బహిరంగంగా ప్రశం సించారు.



# ప్రజా ప్రభుత్వంలో సంక్షేమాన్ని వెనకబడనివ్వం

## రాష్ట్రంలో జరిగే అభివృద్ధిని ఆగనివ్వం

- ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రజలపై ఒక్క రూపాయి భారం మోపం
- వేల కోట్లతో సంక్షేమ పథకాలు తీసుకువస్తున్నాం
- రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకురాబోతున్నం
- రాష్ట్రానికి మేలు చేయాలన్న తలంపుతో సీఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్ నిరంతరం కృషి చేస్తుంది
- చెన్నాపూర్లో సబ్ స్టేషన్ ప్రారంభోత్సవం
- సబ్ స్టేషన్ల నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు




**సమయజ్యోతి 17 జూన్ 2025:**

ప్రజా ప్రభుత్వంలో సంక్షేమాన్ని వెనకబడ నివ్వమని, అభివృద్ధిని ఆగనివ్వమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, డీసీసీ అధ్యక్షుడు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేతుల మీదుగా కొత్తపల్లిగోరి మండలం చెన్నాపూర్ గ్రామంలో నూతనంగా రూ. 140 లక్షలతో నిర్మించిన సబ్ స్టేషన్ ను ప్రారంభించారు. అనంతరం మొరంచపల్లి నుండి మంజూరునగర్ వరకు సాగిన పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వ హించగా, ఈ ర్యాలీలో అతిథులు ప్రచార రథంపై ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం మంజూరునగర్, నవాబు పేట, ధర్మారావుపేట గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలకు శంకుస్థాపనలు చేశారు.

## ఒకేరోజు ఏడు ఎయిర్ ఇండియా విమానాల రద్దు

### సాంకేతిక కారణాలతో రద్దు చేసినట్లు వెల్లడి

**న్యూఢిల్లీ,జూన్ 17సమయజ్యోతి:**



అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా దుర్ఘటన తర్వాత, మంగళవారం ఏకంగా 7 విమానాలను రద్దు చేశారు. రద్దు చేసిన విమానాల్లో 6 బోయింగ్ 787-8 డ్రీమ్‌లైన్ విమానాలు ఉన్నాయి. ఇటీవల, అహ్మదాబాద్ లో ప్రమాదానికి గురైంది ఈ రకం విమానమే. ముందుగా, సాంకేతిక లోపాల కారణంగా అహ్మదాబాద్ -లండన్, ఢిల్లీ-పారిస్ విమానాలను మంగళవారం రద్దు చేశారు. దీని తర్వాత, లండన్-అమృత్‌సర్, బెంగళూర్-లండన్ విమానాలు కూడా రద్దయ్యాయి. మా ప్రయాణీకులకు కలిగిన అసౌకర్యానికి మేము చింతిస్తున్నాము మరియు వీలైనంత త్వరగా వారిని వారి గమ్యస్థానానికి చేర్చడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాము. మేము హోటల్ వసతిని అందిస్తున్నాము. ప్రయాణీకులు రద్దు చేసుకుంటే ఉచిత రీషెడ్యూలింగ్‌పై పూర్తి వాపసులను కూడా అందిస్తున్నాము' అని ఎయిర్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. గత వారం అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్తున్న ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొన్ని క్షణాలకే కుప్పకూలింది. ఈ ప్రమాదంలో విమానంలో 242 మందిలో ఒకరు మినహా అందరూ ప్రాణాలు కోల్పోయారు. విమానం డాక్టర్స్ హాస్టల్‌పై కుప్పకూలడంతో నేలపై చుట్టుపక్కల ఉన్న 33 మంది వరకు మరణించారు.

## ఆషాఢ బోనాల ఉత్సవాలతో తెలంగాణ ఖ్యాతి

# విశ్వవ్యాప్తం కావాలి

- తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా బోనాల ఉత్సవాల నిర్వహణ
- జూన్ 26న గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి (ఎల్లమ్మ) ఆలయంలో తొలి బోనంతో ప్రారంభం
- భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి
- షిటీమ్ లు ఏర్పాటు చేసి మహిళలకు ఇబ్బందులు లేకుండా పర్యవేక్షణ చేయాలి
- ఉద్యోగులు సేవాభావంతో పని చేయాలి
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

2లో.



**సమయజ్యోతి జూన్ 17, సమయజ్యోతి:**

ఆషాఢ బోనాల ఉత్సవాలతో తెలంగాణ ఖ్యాతి విశ్వవ్యాప్తం కావాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం గోల్కొండ కోట ఆవరణలో పోలీస్, రెవెన్యూ, ఆర్అండ్బి, విద్యుత్, దేవాదాయ, వైద్య ఆరోగ్య, జిహెచ్ఎంసి, అగ్నిమాపక, టూరిజం, సమాచార శాఖ అధికారులతో శ్రీ జగదాంబ మహంకాళి దేవస్థానంలో బోనాల కార్యక్రమం ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని సమీక్షించారు.

## తానెప్పుడూ పార్టీ ఐక్యత కోసమే పనిచేశా

### తెలంగాణలో అధికారం దక్కాలన్నదే ఆకాంక్ష కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై రాజాసింగ్ ప్రకటన



**హైదరాబాద్,జూన్ 17సమయజ్యోతి:**

పార్టీలోని ప్రతి ఒక్కరూ బాగుపడాలి, తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావాలనేది తన లక్ష్యమని ఎమ్మెల్యే రాజాసింగ్ పునరుద్ఘాటించారు. తానెప్పుడూ వ్యక్తిగత లబ్ది లేదా పదవుల కోసం పని చేయలేదని స్పష్టం చేశారు. తన కృషి ఎప్పుడూ పార్టీని బలోపేతం చేయడం, పార్టీ ఆదర్శాలను అంకితభావంతో పనిచేయడంపైనే తాను దృష్టి పెట్టానని అన్నారు.

# 42శాతం బిసి రిజర్వేషన్లు సాధిస్తాం

## అంతవరకు విశ్రమించేది లేదు

## రౌంట్‌టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత

**మెదక్,జూన్ 17సమయజ్యోతి:**



బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు సాధించుకుంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. బీసీలంతా చైతన్యం కావాలని కోరారు. కామారెడ్డిలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎన్నికల సమయంలో ప్రకటించిన డిక్లరేషన్ సాధించే వరకు పోరాడుతామని అన్నారు. మంగళవారం మెదక్ జిల్లాలో కామారెడ్డి డిక్లరేషన్ రాజ్యాంగ బద్ధంగా 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇది రాజకీయ వేదిక కాదు.. మానవ హక్కుల వేదిక అని చెప్పారు. విద్యకు, ఉద్యోగాలకు, రాజకీయాలకు వేర్వేరుగా రేవంత్ ప్రభుత్వం రిజర్వేషన్ బిల్లులు పెట్టాలని ఎమ్మెల్సీ కవిత కోరారు. ఢిల్లీకి బీసీ రిజర్వేషన్ బిల్లు పంపామని తమకు ఏం సంబంధం లేదనేలా కాంగ్రెస్ నేతలు అనడం సరికాదని చెప్పారు. బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఒక్కరోజైనా బీసీ బిల్లు గురించి ప్రధానమంత్రి నరేంద్రమోదీతో మాట్లాడారా అని ప్రశ్నించారు. బీసీ బిల్లు వస్తే ఉద్యోగాలు, రాజకీయ అవకాశాలు, నిధులు వస్తాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణనలో చిత్తశుద్ధి లేదని తెలిపారు ఎమ్మెల్సీ కవిత. బీసీ బిల్లు సాధనకు కేంద్రప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని ఎమ్మెల్సీ కవిత కోరారు. బీసీ బిల్లు ఆమోదం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకు రావడానికి జులై 17వ తేదీన రైల్‌రోకో చేపడతామని ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ల అంశం తేలకుండా కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు పెడతామనడం సరికాదని అన్నారు. బీసీలకు రిజర్వేషన్‌లు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే ఆపుతామని చెప్పారు. అందరూ ఏకతాటిపైకి వచ్చి పోరాడితే బీసీ బిడ్డల కాళ్ల వద్దకు పదవులు వస్తాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఇదిలావుంటే కవిత పర్యటనకు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, ఎమ్మెల్యే సునీతా మహేందర్ రెడ్డిలు దూరంగా ఉన్నారు.

# జూబ్లీహిల్స్‌కు ఇప్పుడే ఉపఎన్నిక ఉండకపోవచ్చు

## సీఈఓ సుదర్శన్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,జూన్ 17సమయజ్యోతి:**

హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఇప్పట్లో నోటిఫికేషన్ ఉండకపోవచ్చని, రెండు, మూడు రాష్ట్రాల్లో ఖాళీ అయిన అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల నోటిఫికేషన్ ఇప్పటికే వచ్చిందని సీఈఓ సుదర్శన్ రెడ్డి తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నోటిఫికేషన్ ఇప్పుడే ఉండకపోవచ్చని తెలిపారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు అసెంబ్లీ తమకు గెజిట్ పంపించిందని గుర్తుచేశారు. ఆ గెజిట్ తాము యథాతథంగా కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించామని అన్నారు. జూబ్లీహిల్స్‌లో డిసెంబర్ వరకు కొత్త ఎమ్మెల్యే ఎన్నిక జరగాలని సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం చాలా సంస్కరణలను తీసుకువస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. బూత్ లెవెల్ ఏజెంట్స్, ఈఆర్ఓలతో ఇంటరాక్ట్ కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. వీరికి ట్రైనింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తోందని వివరించారు. పోలింగ్ స్టేషన్‌లలో మినిమం ఓటర్ల సంఖ్యను 1200కు కుదించిందని గుర్తుచేశారు. పోలింగ్ కేంద్రం వద్ద ఆంక్షలను 200 మీటర్ల నుంచి కిలో మీటర్ వరకు పెంచిందని వెల్లడించారు సీఈఓ సుదర్శన్ రెడ్డి. పోలింగ్ కేంద్రానికి కిలోమీటర్ వరకు పార్టీలు ప్రచారం చేయడానికి వీలు లేదని సీఈఓ సుదర్శన్ రెడ్డి అన్నారు. పోలింగ్ సెంటర్స్ వద్ద ఇక నుంచి మొబైల్ ఫోన్స్ కోసం డిపాజిట్ ఫెసిలిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈనెల(జూన్) 26, 27 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర ఃఒం, ఃఒక్షలకు ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం ట్రైనింగ్ ఇస్తోందని చెప్పారు. నేషనల్ లెవెల్ లీగల్ కాన్ఫరెన్స్ కోసం ముగ్గురు న్యాయవాదులకు శిక్షణ ఇస్తోందని అన్నారు. రూరల్‌లో 87శాతం, అర్బన్‌లో 67శాతం ఓటర్, ఆధార్ కార్డ్ లింక్ జరిగిందని సీఈఓ సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. గోదావరి-బనకచర్లపై కీలక నిర్ణయం

# నేడు ఎంపిలతో ప్రభుత్వం సమావేశం

## మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,జూన్ 17సమయజ్యోతి:**

గోదావరి-బనకచర్ల లింక్‌ప్రాజెక్టు విషయంలో వపక్షాల నుంచి విమర్శలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తదుపరి అనుసరించాల్సిన కార్యాచరణ కోసం తెలంగాణ ఎంపీలతో రాష్ట్ర ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేసింది. బుధవారం సాయంత్రం 4 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని, రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను గౌరవ అతిథులుగా ఆహ్వానించినట్లు చెప్పారు. కాంగ్రెస్‌తోపాటు భాజపా, భారాస, మజ్లిస్ పార్టీలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలకు లేఖలు రాయడంతోపాటు స్వయంగా ఫోన్ చేసిన ఆహ్వానించామని తెలిపారు. 'ట్రైబ్యునల్, చట్టాలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం చేపట్టిన గోదావరి- బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వానికి అభ్యంతరాలు తెలిపాం. సీఎం రేవంత్‌రెడ్డి, నేను లేఖలు రాశాం. జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కూడా కలిశాం. ఏపీ ప్రతిపాదిస్తున్న ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రజల నీటి హక్కులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం కేంద్ర జల సంఘం వద్ద ఉన్న గోదావరి-బనకచర్ల ప్రీఫీజిబిలిటీ నివేదికను తిరస్కరించాలని కోరాం. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని తదుపరి కార్యాచరణ తీసుకోవడానికి గురువారం ఎంపీలతో సమావేశమై అందరి అభిప్రాయాలు తీసుకోవాలని నిర్ణయించాం'అని ఉత్తమ్ తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

# తానెప్పుడూ పార్టీ ఐక్యత కోసమే పనిచేశా

కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలపై బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందించారు. పార్టీలో అందరికీ తగిన గౌరవాన్ని ఇస్తూ, ఈ విషయంపై తాను నేరుగా స్పందించాలనుకుంటున్నానని తెలిపారు. తన ఉద్దేశ్యం ఎప్పుడూ సరళంగా, నిష్కల్మషంగా ఉంటుందని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటనను రాజాసింగ్ విడుదల చేశారు. అయితే, తెలంగాణలోని అన్ని 119 నియోజకవర్గాల్లో ఎలా విజయం సాధించడానికి బదులుగా, తనను మాత్రమే లక్ష్యంగా చేసుకొని, తనను విడదీసి, అడ్డంకులు సృష్టిస్తున్నారని.. అయినప్పటికీ తాను పార్టీకి అంకితమైన, నిస్వార్థ సేవ చేశానని రాజాసింగ్ చెప్పారు. పార్టీ కార్యకర్తను ఇబ్బంది పెడితే ఏం లాభమని రాజాసింగ్ ప్రశ్నించారు. తాను ఎప్పుడూ పార్టీకి అనుకూలంగా నిలబడ్డానని గుర్తుచేశారు. ఈ రోజు తాను తన కోసం కాకుండా, పార్టీ ఐక్యతకు, అదే ఉద్దేశ్యంతో పనిచేస్తున్న లక్షలాది కార్యకర్తల మనోబలాన్ని కాపాడుకోవటం కోసం మాట్లాడుతున్నానని స్పష్టం చేశారు. కిషన్‌రెడ్డి తమకు కొంత సమయం కేటాయించాలని కోరారు. తాను, పార్టీ సహచరులు మీతో వ్యక్తిగతంగా కలిసి, తమ సమస్యలను మీ దృష్టికి తీసుకువస్తామని చెప్పారు. కిషన్‌రెడ్డి ఎక్కడైనా, ఎప్పుడైనా సమావేశం నిర్ణయిస్తే తాము రావడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తాము పార్టీని విభజించడానికి కాదని, ఐక్యతను తీసుకురావడానికి కృషి చేస్తామని అన్నారు. పార్టీ నిజమైన లక్ష్యాన్ని మనం మరచిపోకూడదని చెప్పారు. తెలంగాణకు బీజేపీ ప్రభుత్వం అవసరమని అన్నారు. వ్యక్తిగత విభేదాలను విడిచిపెట్టి, ఐక్యంగా పని చేద్దామని రాజాసింగ్ కోరారు.

# సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ అందించండి

## ఫార్ములా కేసులో కెటిఆర్‌కు ఎసిబి ఆదేశం

**హైదరాబాద్,జూన్ 17సమయజ్యోతి:**

ఫార్ములా ఈ కార్ రేసు కేసులో ఎసిబి దూకుడు పెంచింది. ఈ కేసుకు సంబంధించి కెటిఆర్ సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ లను స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమైంది. సోమవారం ఫార్ములా ఈ కేసులో ఎసిబి విచారణకు కెటిఆర్ హాజరైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఎసిబి అధికారులు వేసిన పలు ప్రశ్నలకు కెటిఆర్ సమాధానాలు ఇచ్చారు. అనంతరం ఆయన వాగ్మూలాన్ని రికార్డు చేశారు. ఈ విచారణ అనంతరం కెటిఆర్ వాడిన సెల్‌ఫోన్, మ్యాక్‌బుక్, ట్యాబ్‌లో కీలక సమాచారం ఉందని ఎసిబి అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. ఈ ఎలక్ట్రానిక్ పరికరాల నుంచే కెటిఆర్, అధికారులకు ఆదేశాలు ఇచ్చారని అనుమానిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కెటిఆర్ సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ లను పరిశీలించేందుకు ఎసిబి నిర్ణయించింది. కెటిఆర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా డాక్యుమెంట్లను రెడీ చేస్తున్న ఎసిబి అధికారులు.. రేపటిలోగా సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ అప్పగించాలని కెటిఆర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో న్యాయ సలహా ప్రకారం నడుచుకుంటానని కెటిఆర్ పేర్కొన్నారు.

# హైదరాబాద్ నుంచి నేరుగా ఇథియోపియా సర్వీస్

**హైదరాబాద్,జూన్ 17సమయజ్యోతి:**

హైదరాబాద్ నుంచి ఆఫ్రికాకు నేరుగా మొట్టమొదటిసారి విమాన సర్వీసు ప్రారంభమైంది. శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి ఇథియోపియా రాజధాని అడ్డిస్ అబాబాకు నాన్-స్టాప్ సేవలను ప్రారంభించారు. దీంతో హైదరాబాద్ గ్లోబల్ కనెక్టివిటీ మరింత బలపడింది. ఈ సేవలను ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ సంస్థ నిర్వహిస్తోంది. అడ్డిస్ అబాబా నుంచి హైదరాబాద్‌కు సోమ, బుధ, శుక్రవారాల్లో.. హైదరాబాద్ నుంచి అడ్డిస్ అబాబాకు మంగళ, గురు, శనివారాల్లో సర్వీసులు నడపనున్నారు. ఈ విమాన సర్వీసుతో అడ్డిస్ ఇథియోపియాతో భారత వ్యాపార, పర్యాటక ప్రయాణికులకు మరింత అనుకూలత లభించనుంది. మరోవైపు భారత్‌లో వైద్యం చేయించుకునేందుకు ఆఫ్రికాలోని ఇథియోపియా, నైజీరియా, టాంజానియా, ఉగాండా, రువాండా, జాంబియా, కేమరూన్, కెన్యా దేశాల నుంచి అనేక మంది రోగులు వస్తుంటారు. అలాంటి వారికి ఈ విమాన సర్వీసు ఉపయుక్తంగా ఉండనుంది.

మొదటి పేజీ తరువాయి

# ఆషాడ బోనాల ఉత్సవాలతో తెలంగాణ ఖ్యాతి విశ్వవ్యాప్తం కావాలి

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బోనాల ఉత్సవాల సందర్భంగా ప్రజలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు నిరంతర పర్యవేక్షణ చేయాలని, ఆర్అండ్బి భక్తులకు ఇబ్బందిగా కలగకుండా బారీకేడ్స్, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, రెప్ప పాటు కూడా కరెంటు పోకుండా నిరంతరం విద్యుత్ శాఖ విద్యుత్ ను సరఫరా చేయాలని, రెవెన్యూ శాఖ ఏర్పాట్లను పర్యవేక్షించాలని, బోనాలు ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో సేవాభావంతో పనిచేయాలని సూచించారు. చాలా సంవత్సరాలుగా హైదరాబాద్ షాన్ గా గోల్కొండ నుండి తొలి బోనం జూన్ 26 న ప్రారంభం అవుతుందని ఎలాంటి లోటుపాట్లు లేకుండా భక్తులకు అసౌకర్యం లేకుండా ఈ ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. అధికారులు బాధ్యతగా ఉంటూ అమ్మవారికి సేవ చేసుకునే అవకాశం దొరికిందని బాధ్యతగా నిమగ్నమై పని చేయాలన్నారు. గౌరవ ముఖ్యమంత్రి ఇప్పటికే బోనాల ఉత్సవాలకు 20కోట్లు నిధులు కేటాయించారని అన్నారు. ఎంసిహెచ్‌ఆర్డిలో ఇప్పటికే బోనాల ఉత్సవాలపై రివ్యూ చేసుకున్నామని,

# ప్రజా ప్రభుత్వంలో సంక్షేమాన్ని వెనకబడనివ్వం

మొదటి పేజీ తరువాయి

అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రజలపై ఒక్క రూపాయి భారం మోపకుండా వేల కోట్లతో సంక్షేమ పథకాలు తీసుకు వస్తున్నామని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకురాబోతున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి మేలు చేయాలన్న తలంపుతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం క్యాబినెట్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని అన్నారు. రూ.22,500 కోట్లు ఖర్చు చేసి 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించబోతున్నామని తెలిపారు. గత పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి, కనీసం ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. మేం అధికారంలోకి రాగానే సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసి గ్రూప్ వన్ పరీక్షను విజయవంతంగా నిర్వహిం చామన్నారు. ఏడాదిన్నర కాలంలో 57వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, మరో 30 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయబోతున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు యువతను ఆర్థికంగా ప్రోత్సహిం చేందుకు తొమ్మిది వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకాన్ని తీసుకువచ్చామన్నారు. 5 లక్షల మంది నిరుద్యోగులు వారి కాళ్లపై వారు నిలబడేలా ప్రోత్సహించేందుకు తొమ్మిది వేల కోట్ల నిధులు ఖర్చు చేయనున్నామన్నారు. ప్రజా ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీని మొదటి ఏడాదిలోనే చేసిందన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతు రుణమాఫీ కోసం రూ. 21,500 కోట్లు ఖర్చు చేసామన్నారు. రూ.13 వేల కోట్లు ఖర్చు చేసి 90 లక్షల కుటుంబాలకు ఒక్కొక్కరికి ప్రతి నెల 6 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో సగభాగంగా ఉన్న మహిళలు రాష్ట్రంలోని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి, గుడికి, లేదా పిల్లల బడికి వెళ్లేందుకు ప్రతి మహిళ ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యాన్ని ఇందిరమ్మ ప్రభుత్వం కల్పించిం దన్నారు. పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాలల్లో పెద్ద సంఖ్యలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# కలెక్టర్ పమేల సత్పతిని ఓ రేంజ్‌లో ప్రశంసించిన సీఎం రేవంత్ రెడ్డి

ప్రభుత్వ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకుని, ప్రజా ఆరోగ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కల్పించినందుకు ఆమెను అభినందిస్తూ సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక సదుపాయాలు, అనుభవం ఉన్న వైద్యులు, సేవా దృక్పథం ఉన్న సిబ్బంది ఉన్నారు. సర్కారు దవాఖానలో నాణ్యమైన వైద్య సేవలు అందుతాయన్న విశ్వాసం మాత్రమే ఇప్పుడు అత్యవసరం. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొంది ఆ నమ్మకాన్ని కలిగించిన కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి నా అభినందనలు అని ముఖ్యమంత్రి 'ఎక్స్' వేదికగా కొనియాడారు. ఈ చర్య ప్రభుత్వ దవాఖానలపై సామాన్య ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు ఒక కీలకమైన ఉదాహరణగా నిలుస్తుంది.

### కలెక్టర్ పమేలా సత్పతి నిర్ణయం అభినందనీయం

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి కొంతకాలంగా శ్వాస సంబంధిత సమస్యలు,ముఖ్యంగా సైనస్, తీవ్ర తలనొప్పితో బాధపడుతున్నారు. ఆదివారం ఉదయం ఆమె కరీంనగర్‌లోని స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేరారు. వైద్యులు పరీక్షించిన తర్వాత, ముక్కులో ఎముక పెరుగుదల ఉన్నట్లు గుర్తించి, శస్త్రచికిత్స అవసరమని సూచించారు. ఈఎన్టీ (చెవి, ముక్కు, గొంతు) సర్జన్ల బృందం పర్యవేక్షణలో ఆమెకు ఎండోస్కోపీ నేసల్ సర్జరీ, సెప్టోప్లాస్టిక్ సర్జరీ విజయవంతంగా జరిగాయి. ఒక ఉన్నత స్థాయి ప్రభుత్వ అధికారి, ప్రత్యేకించి జిల్లా కలెక్టర్, ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించకుండా ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందడం, అది కూడా ఒక శస్త్రచికిత్స చేయించుకోవడం నిజంగా అరుదైన, ఆదర్శనీయమైన చర్యగా చెప్పవచ్చు. ఇది ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ సౌకర్యాల పట్ల ప్రజల్లో తరచుగా ఉండే అపనమ్మకాన్ని దూరం చేస్తుంది. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కూడా కలెక్టర్ పమేలా సత్పతిని అభినందిస్తూ, ఆమె చర్య ప్రభుత్వాసుపత్రుల సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈఎన్టీ వైద్యుల బృందాన్ని కూడా ఆయన ప్రశంసించారు. కలెక్టర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి, ఆరోగ్యమంత్రి ట్వీట్లు వైరల్


**దక్షిణ మధ్య రైల్వే**

Follow us on X @ SCRailwayindia S.C రైల్వే యొక్క టెండర్ నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్‌లో చూడవచ్చు: www.scr.indianrailways.gov.in

**ప్రకటన నోటీసు No.01/2025/ATVMS తేదీ .16.06.2025 నాండెడ్ డివిజన్ కంటే కాంట్రాక్ట్ ప్రాతిపదికన ATVMS ద్వారా అన్-రిజర్వ్డ్ టిక్కెట్లను జారీ చేయడానికి ఫెసిలిటేటర్ల నిశ్చితార్థం కోసం**

PUB/0723

సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, సౌత్ సెంట్రల్ రైల్వే, నాండెడ్డివిజన్, నాండెడ్, భారత అధ్యక్షుడు తరపున, సౌత్ సెంట్రల్ రైల్వే యొక్క రిటైర్డ్ రైల్వే ఉద్యోగుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది మరియు 18 సంవత్సరాల మరియు అంతకంటే ఎక్కువ వయస్సు గల సాధారణ ప్రజల వయస్సు గల దరఖాస్తులను ఆహ్వానిస్తుంది, వంద మరియు పదకొండు (111) నిమగ్నమవ్వడానికి, ఈ క్రింది రైల్వే డివిజన్స్‌లో అన్-రిజర్వు చేయని టిక్కెట్ల ద్వారా వంద మరియు పదకొండు (111) సదుపాయాల కోసం. ప్రారంభంలో, ఫెసిలిటేటర్‌గా పనిచేయడానికి నిశ్చితార్థం 2 సంవత్సరాల కాలానికి ఉంటుంది మరియు విధాన మార్గదర్శకాల ప్రకారం ఎప్పటికప్పుడు మరియు సమర్థ అధికారం యొక్క సంతృప్తి ప్రకారం పాలసీ మార్గదర్శకాల ప్రకారం ఈ పథకం యొక్క పొడిగింపుకు లోబడి మరింత ఒక సంవత్సరం వరకు విస్తరించవచ్చు. ATVM ఫెసిలిటేటర్‌గా నిశ్చితార్థం కారణంగా ఎంచుకున్న దరఖాస్తుదారునికి రైల్వేలో ఉపాధి కోసం ఎటువంటి దావా ఉండదు. రైల్వే ద్వారా వేతనం/జీతం/వేతనాలు చెల్లించబడవు. ATVM స్మార్ట్ కార్డులలో ఎప్పటికప్పుడు వర్తించే విధంగా ఎంచుకున్న ఫెసిలిటేటర్ బోనస్‌ను నిలుపుకోవటానికి అనుమతించబడుతుంది. మరిన్ని వివరాల కోసం, దయచేసి బోనస్ యొక్క అర్హతపై నిబంధనలు మరియు షరతుల యొక్క పారా నెం .3 చూడండి. నాండెడ్ డివిజన్‌లో ప్రయాణించే ప్రజలకు టిక్కెట్లు జారీ చేయడానికి ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషీన్స్ (ఎటివిఎంఎస్) వద్ద ఫెసిలిటేటర్లకు అవసరమైన స్టేషన్ల జాబితా ఈ క్రింది విధంగా ఉంది:

| S No. | స్టేషన్ | వర్గం | ఫెసిలిటేటర్ల కోసం కేటాయించిన ATVM ల సంఖ్య | షిఫ్టుల సంఖ్య | ఫెసిలిటేటర్ల సంఖ్య అవసరం |
|---|---|---|---|---|---|
| 1 | నాగర్సోల్ | NSG-3 | 1 | 2 | 2 |
| 2 | రోటెగావ్ | NSG-5 | 1 | 2 | 2 |
| 3 | లాసూర్ | NSG-5 | 1 | 2 | 2 |
| 4 | ఔరంగాబాద్ | NSG-2 | 4 | 3 | 12 |
| 5 | ముకుంద్వాడి | NSG-5 | 1 | 2 | 2 |
| 6 | జల్నా | NSG-3 | 2 | 3 | 6 |
| 7 | పార్టూర్ | NSG-5 | 2 | 2 | 4 |
| 8 | సెలు | NSG-5 | 2 | 2 | 4 |
| 9 | మన్వాట్ రోడ్ | NSG-5 | 1 | 2 | 2 |
| 10 | పర్భాని | NSG-3 | 5 | 3 | 15 |
| 11 | పూర్ణ | NSG-4 | 3 | 2 | 6 |
| 12 | నాండెడ్ | NSG-2 | 7 | 3 | 21 |
| 13 | మడ్ ఖేడ్ | NSG-5 | 2 | 3 | 6 |
| 14 | భోకర్ | NSG-5 | 1 | 2 | 2 |
| 15 | హిమాయత్నగర్ | NSG-5 | 1 | 2 | 2 |
| 16 | కిన్వత్ | NSG-5 | 2 | 2 | 4 |
| 17 | ఆదిలాబాద్ | NSG-4 | 2 | 2 | 4 |
| 18 | బాస్మత్ | NSG-5 | 1 | 3 | 3 |
| 19 | హింగోలి | NSG-5 | 2 | 2 | 4 |
| 20 | వాషిమ్ | NSG-4 | 2 | 2 | 4 |
| 21 | గ్నాగఖేర్ | NSG-5 | 2 | 2 | 4 |
| Total | | | 45 | 48 | 111 |

ప్రకటన నోటీసు మరియు దరఖాస్తు ఫారం సౌత్ సెంట్రల్ రైల్వే వెబ్‌సైట్‌లో www.scr.indianrailways.gov.in వద్ద లభిస్తుంది. సౌత్ సెంట్రల్ రైల్వే యొక్క రిటైర్డ్ రైల్వే ఉద్యోగులు మరియు ATVM ల ద్వారా అన్-రిజర్వు చేయని టిక్కెట్లు జారీ చేయడానికి ఫెసిలిటేటర్‌గా పనిచేయడానికి ఆసక్తి ఉన్న సాధారణ ప్రజలు తమ దరఖాస్తులను దరఖాస్తులోని అన్ని స్తంభాలలో నింపి నోటిఫికేషన్ యొక్క అన్ని పేజీలలో సంతకం చేయాలి. అప్లికేషన్ సూపర్ స్క్రైబ్ చేయబడుతుంది "_____________ రిల్వే స్టేషన్ వద్ద ATVM ఫెసిలిటేటర్ కోసం దరఖాస్తు__________ (రిటైర్డ్ రైల్వే ఇప్లోవీ/జనరల్ పబ్లిక్) విభాగంలో". వర్గం (రిటైర్డ్ రైల్వే ఉద్యోగి/జనరల్ పబ్లిక్) ఒకటి మూసివున్న కవర్‌లో స్పష్టంగా సూచించబడాలి. మూసివున్న కవర్‌లో ఉన్న దరఖాస్తు గది సంఖ్య 102 లోని టెండర్ బాక్స్‌లో పడిపోతుంది, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, DRM ఆఫీస్ కాంప్లెక్స్, S.C. రైల్వే, నాండెడ్ డివిజన్, నాండెడ్ - 431605 10.07.2025 న 15.00 గంటలకు ముందు. దరఖాస్తును పోస్ట్/కొరియర్ అంగీకరించదు. 10.07.2025 యొక్క 15.00 గంటల తర్వాత అందుకున్న దరఖాస్తులు అంగీకరించబడవు.

| | | |
|---|---|---|
| 1 | రైల్వే వెబ్‌సైట్ నుండి దరఖాస్తు ఫారమ్‌లను డౌన్‌లోడ్ చేయడం | 19.06.2025 యొక్క 10.00 గంటల నుండి 10.07.2025 యొక్క 10.07.2025 గంటల వరకు |
| 2 | టెండర్ బాక్స్‌లో దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీ, | 10.00 గంటల నుండి 10.07.2025 - 15.00 గంటలు 10.07.2025 |
| 3 | టెండర్ మూసివేయడం | 15.00 గంటలు 10.07.2025 |
| 4 | టెండర్ బాక్స్ తెరవడం | 15.30 గంటలు 10.07.2025 |

A0893 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, నాండెడ్


# అవగాహనతో ప్రభుత్వ పాఠశాలల్లో అద్భుతాలు సాధ్యమే

## - మండల విద్యాధికారి జి.వెంకట్

**కామేపల్లి, ఖమ్మం జిల్లా, మే 17, 2025:సమయజ్యోతి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేస్తున్న రాయితీల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించాలని, తద్వారా విద్యారంగంలో విశేష మార్పులు తీసుకురావచ్చని మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) జి.వెంకట్ అన్నారు.మంగళవారం కొత్తలింగాలలోని ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించిన నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, ఈ విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేయడం ప్రారంభించిందని తెలిపారు. భవిష్యత్తులో అవసరమైన ఇతర విద్యా పరికరాలను కూడా ప్రభుత్వం అందించే అవకాశం ఉందని వెల్లడించారు.ప్రస్తుతం అందిస్తున్న సౌకర్యాల గురించి గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రైవేట్ పాఠశాలలపై ఆధారపడకుండా ప్రభుత్వ పాఠశాలలవైపు ఆకర్షణ పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఉపాధ్యాయులను కోరారు.ఈ సందర్భంగా, ఈ విద్యా సంవత్సరంలో నాలుగు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకొని, జీరో అడ్మిషన్ స్థితిలో ఉన్న పాఠశాలల్లో 15 మంది విద్యార్థులను చేర్చడం ద్వారా వాటిని పునరుజ్జీవింపజేసి, భవిష్యత్తు తరాల కోసం ఉపాధి అవకాశాలను కల్పించారని అన్నారు. ఇలాంటి ఉపాధ్యాయులకు విద్యాశాఖ తరఫున హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు."ఉపాధ్యాయులు సంకల్పంతో ముందుకు వస్తే, ఏదైనా సాధ్యమే" అని జి. వెంకట్ అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో పిఆర్‌పిలు జి. మోహన్, బి. సూరిబాబు, ప్రధానోపాధ్యాయులు సయ్యద్ షౌకత్ అలీ, వి. కేశవరావు, కె. నారాయణ, మురళీధర్ రెడ్డి, వై. శ్రీనివాసరావు, లలిత తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో విద్యార్థులకు ట్రాఫిక్ పై అవగాహన కల్పించిన పోలీస్

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి**

ప్రతి ఒక్కరికి ట్రాఫిక్ నియామాల పై అవగాహన ఉండాలని అది విద్యార్థి దశ నుండే మొదలు మొదలు పెట్టాలని మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ట్రాఫిక్ నియమాలపై అవగాహన ఉండాలని అది విద్యార్థి దశ నుండే మొదలవుతుందని ఈరోజు సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ట్రాఫిక్ నియమాలపై ఒక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ పోలీసులు నిర్వర్తించే విధులను విద్యార్థులకు తెలియజేస్తూ వివరించడం వారితో కలిసి ట్రాఫిక్ నియంత్రణ నిర్వహిస్తూ ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు, మైనర్ లు డ్రైవింగ్ చేయడం వల్ల ఎదురయ్యే నష్టాల గురించి వివరించడం జరిగిందని తెలిపారు. ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ హెల్మెట్ ధరించి ప్రయాణిస్తున్న వాహన దారులను గుర్తించి వారికి విద్యార్థుల చేత పండ్లను పంపిణీ చేయించామని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ భద్రతపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో సింగరేణి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, మందమర్రి పీఎస్ ఏఎస్ఐ మల్లేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# డంపింగ్ యార్డు ను తొలగించాలని రాస్తా రోకో

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

అమరచింత మండల కేంద్రంలోని చేనేత పట్టు వస్త్రాల తయారు కేంద్రం పక్కన మున్సిపాలిటీ డంపింగ్ యార్డు ఉంది అందులో నిల్వ చేసిన చెత్తాచెదారం నుండి దుర్వాసన వెదజల్లడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. డంపింగ్ యార్డు ను ఇక్కడి నుండి తొలగించాలని ఇది వరకు సంబంధిత అధికారులకు విన్నవించినమని అన్నారు. రోజు, రోజుకు డంపింగ్ యార్డు నుండి ఈగలు, దోమలు, కుళ్ళిన దుర్వాసనను వెదజల్లడంతో ఆ దుర్వాసనను మేము భరించలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తొలగిచాలి ఇక్కడి నుండి డంపింగ్ యార్డును అంటూ మహిళలు నినాదాలు చేశారు. రాస్తా రోకోసందర్భంగా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయినావి. ఈ కార్యక్రమంలో చేనేత వస్త్రాలు తయారుదారులు అశోక్, మహేష్, మౌనిక, మల్లేశ్వరి, శారద, సంధ్య తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# ఎలాంటి ఇబ్బంది కలగకుండా పనులను పూర్తి చేయండి

## - కార్పొరేటర్ పుష్పానగేష్

**సమయజ్యోతిన్యూస్ రామచంద్రాపురం**

ప్రజలకు ఇబ్బంది కలగకుండా పనులను పూర్తి చేయాలని రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పానగేష్ అధికారులను ఆదేశించారు మంగళవారం డివిజన్ లోని శ్రీనివాసనగర్ కాలనీ సండే మార్కెట్ బస్ రూట్ లో 10 వ బ్లాక్ లో 25 లక్షల ఖర్చుతో వేస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆమె పరిశీలించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించిన కార్పొరేటర్ డ్రైనేజీ పనులు పూర్తి కాగానే వెంటనే సీసీ రోడ్ ను నూతనంగా వేయిస్తానని తెలిపారు ఆమె వెంట జలమండలి డిజీఎం శివకృష్ణ మేనేజర్ లోకేష్ స్థానిక బస్తీ వాసులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పీటర్ హబీబ్ సామ్రాట్ రంజి శ్రీకాంత్ నాయక్




సీఎంమల్లేష్ బైకన్ నవీన్ యాదవ్ హన్మంతు రమేష్ సత్తయ్య వసంత్ తదితరులు పాల్గొన్నారు

# 76,974 మంది రైతుల ఖాతాల్లో రూ. 43 కోట్ల రైతు భరోసా నిధులు జమ ఁకలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

జిల్లాలోని అన్నదాతలకు రైతు భరోసా కింద
రెండు రోజుల్లో రూ. 43 కోట్లకు పైగా డబ్బులు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఒక ప్రకటనలో వెల్లడించారు. ఖరీఫ్ సీజన్ సాగు కోసం రైతులకు ఉపయోగపడేలా రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద నిధులు విడుదల చేస్తుందని తెలిపారు. ఈ రోజు వరకు జిల్లాలోని 13 మండలాల పరిధిలోని 76,974 మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ.43,22,42,859 డబ్బులు జమ అయ్యాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



# భూ నిర్వాసితులకు 150 మందికి చెక్కులు అందజేశాం: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

వేములవాడ పట్టణంలో రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు నష్ట పరిహారం చెక్కులు పంపిణీ చేశారు. వేములవాడ తిప్పాపూర్ బ్రిడ్జి నుంచి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వరకు రోడ్డు విస్తరణ చేపట్టనున్న సందర్భంగా భూములు కోల్పోతున్న నిర్వాసితులకు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, వేములవాడ ఆర్డీవో రాధాబాయి చెక్కులు పంపిణీ చేశారు. ఇప్పటిదాకా వేములవాడలోని 150 మందికి చెక్కులు అందజేసినట్లు ఆర్డీవో తెలిపారు. వేములవాడ లోని ఇంకా చాలా మంది నష్టపరిహారం చెక్కులు తీసుకునేందుకు సుముఖంగా ఉన్నారని, వారికి అందజేస్తామని ఆర్డీవో చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



# అమరచింత లో మంత్రి వాకిటి శ్రీహరికి ఘన స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమ అభివృద్ధి క్రీడల యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి బుధవారం ఉదయం 10.30 గంటలకు అమరచింత మీదుగా ఆత్మకూరు వెళుతున్నారు. నూతనంగా మంత్రి బాధ్యతలు చేపట్టి తొలి సారి అమరచింత కు విచ్చేయుచున్న మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరికి తెలంగాణ రాష్ట్ర కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాటు చేశారు. మంత్రి పర్యటన కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అరుణ్ కుమార్, మండల అధ్యక్షుడు కొత్తగౌని మహేందర్ రెడ్డి తెలిపారు.



సమయజ్యోతి
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## అప్పులు...కేసులు...దబాయింపులు !

ఉమ్మడి ఎపి రాష్ట్రాన్ని విడదీసిన తరవాత రెండు తెలుగు రాష్ట్రాల ఏర్పాటు లక్ష్యం నెరవేరిందా అంటే లేదనే చెప్పాలి. ఉమ్మడి ఎపికన్నా దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రం ఏర్పడ్డదే తమ అధికారం కోసం అన్నరీతిలో తెలంగాణలో దాదాపు పదేళ్ల పాటు టిఆర్ఎస్ లేదా బిఆర్ఎస్ రాజ్యమేలింది. ఐదేళ్లపాటు జగన్ కూడా ఎపిని సర్వనాశనం చేసి, అన్నింటా అవినీతిని జొప్పించారు. ఇలా దోపిడీ రాజ్యం నడిచింది. తెలుగు రాష్ట్రాల్లో దోపిడీని ప్రజలు పట్టించుకోకుండా పందేరాలకోసం పడిగాపులు కాస్తున్నారు. ఇక తెలంగాణలో అయితే ధనిక రాష్ట్రమంటూ అప్పులకుప్పను చేసింది. పథకాల పేరుతో డబ్బులు పందేరం చేసింది. కాళేశ్వరం పేరుతో లక్షకోట్లు గోదాట్లో పోసారు. ఇది పనికిరాని ప్రాజెక్ట్ అంటూ తాజాగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా వ్యాఖ్యానించారు. ఇది వయబుల్ కాదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ రాష్ట్రానికి ఉపయోగం కన్నా నష్టం ఎక్కువగా కలిగించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. దీనిపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఈ మేరకు నివేదిక ఇచ్చిందని వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ ఫీజిబిలిటీ లేనిదిగా బీజేపీ గతంలోనే చెప్పిందని, ఇప్పుడు కూడా సీబీఐ విచారణ కోరుతున్నామని తెలిపారు. గత బిఆర్ఎస్ పదేళ్ల కాలాన్ని పరిశీలిస్తే అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, గొర్రెల పంపెంకం,చేపల పెంకం, రైతుబంధు, ఈ కార్ రేసు వంటివన్నీ అవినీతికి ఆలవాలంగా ఉన్నాయి. ఇందులో పెట్టిన డబ్బులన్నీ స్వార్థానికి వాడుకున్నారు. కోట్లల్లో అవినీతి జరిగింది. దీనిపై విచారణ కూడా సీరియస్‌గా సాగడం లేదు. ఏడాదిన్నరయినా ఫోన్ ట్యాపింగ్ సహా ఏ కూసూ తేలడం లేదు. ఇవన్నీ మరచిపోయి కెటిఆర్ సవాళ్లు విసురుతున్నారు. హరీష్ రావు విమర్శలు చేస్తున్నారు. కవిత ఒంటికాలు మీద లేస్తున్నారు. మా నాయనకు నోటీసులు ఇస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము తప్ప ఇతరులు పాలనకు పనికిరారన్న రీతిలో వ్యాఖ్యలు చేస్తున్నారు. నిజానికి కేసులు పెడితే ధైర్యంగా ఎదుర్కోవాలి. నిజాయితీ నిరూపించుకోవాలి. కానీ నిగగ్గదీస్తున్నారు. ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారానికి సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సవాళ్లు విసరుతూ చట్టాన్ని అపహాస్యం చేస్తున్నారు. దమ్ముంటే లై డిటెక్టర్ పరీక్షలకు రావాలని సవాల్ చేస్తున్నారు. సిఎం రేవంత్‌ను లై డిటెక్టర్ పరీక్షకు రావాలని సవాల్ చేయడం ఆయన అసహనాన్ని తెలియచేస్తోంది. కుంభకోణం లేదు..లంబకోసం లేదు..లొట్టపీసు కేసు అంటూ అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారు. పదేళ్లపాటు దర్జాగా పాలన సాగించి, దగా చేసిన నేతలు ఇవాళ సవాళు విసరుతున్నారు. సవాళ్లు విసిరితే ఇక చట్టాలు ఎందుకు..? కోర్టులు ఎందుకో చెప్పాలి. ఫార్ములా కార్ రేసులో తప్పు చేయలేదని అంటున్నారు. తప్పు చేయకపోతే...నేరుగా 55 కోట్లు ఎందుకు తరలించారన్నదానికి సమాధానం చెప్పాలి. నీ ఇష్టం వచ్చినట్లుగా డబ్బులు విడుదల చేసే అధికారం ఎవరిచ్చారన్నది చెప్పాలి. విచారణకు హాజరు కావడానికి మందీ మార్బలాన్ని వెనకేసుకుని రావడం ఎక్కడి ప్రజాస్వామ్యమో చెప్పాలి. కెటిఆర్ విచారణకు వెళుతున్నారా లేక ..ఏదైనా విజయయాత్రకు వెళుతున్నారా చెప్పాలి. చేసిన తప్పులకు ప్రజాకోర్టులో ప్రజలు ఇప్పటికే శిక్షించారు. కెటిఆర్ విచారణకు వస్తుంటే దాదాపు 200 మంది పోలీసులు అక్కడ మోహరించాల్సి వచ్చింది. అటు, ఈడీ కార్యాలయం వద్ద అధిక సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు చేరుకోగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం జరిగి తోపులాట చోటు చేసుకుంది. దీంతో అక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఫార్ములా ఈ రేస్‌లో వ్యవహారానికి సంబంధించి ఏసీబీ దర్యాప్తు చేస్తుండగా.. ఇందులో ఆర్బీఐ అనుమతి లేకుండా విదేశీ సంస్థకు నిదుల చెల్లింపుపై ఈడీ మరో కేసు నమోదు చేసింది. ఇదే కేసులో ఇప్పటికే అప్పటి పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలను ఈడీ విచారించింది. కాగా.. ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ను కొట్టేయాలని కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించగా.. ఈ నిర్ణయాన్ని ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అయితే, ఈ పిటిషన్‌ను సైతం సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఇంత జరిగినా కెటిఆర్‌కు తాను చేసిన తప్పేంటో తెలియడం లేదని అనుకుంటే ఎలా. తప్పు చేయలేదని నటించినంత మాత్రాన తప్పులు ఒప్పులు కావు. హెచ్ఎండీఏ ఖాతా నుంచి విదేశీ సంస్థకు నిధుల బదిలీపై ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. విదేశీ సంస్థకు రూ.45.7 కోట్ల బదిలీ వ్యవహారంపై కేటీఆర్‌ను ప్రశ్నిస్తున్నారు. ఇది కళ్లకు కనిపిస్తున్న నిజం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పెడుతున్న కేసులు ఘనతను తుడిచేయలేవని అంటున్నారు. 'హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేస్ నిర్వహణ అనేది మంత్రిగా తాను తీసుకున్న నిర్ణయాల్లో మంచిదని చెబుతున్నారు. ఆనాడు రేసర్లు అంతా హైదరాబాద్ వచ్చి నగరాన్ని కీర్తించారట. హైదరాబాద్ నగర బ్రాండ్ నాకు ముఖ్యం. పారదర్శకంగా రూ.46 కోట్లు బ్యాంక్ టు బ్యాంక్ విధానంలో చెల్లించిన తర్వాత అవినీతి ఎక్కడిది..? మనీ లాండరింగ్ ఎక్కడిది..?. ఒక్క రూపాయి కూడా వృథా కాలేదు. ప్రతి పైసాకి లెక్క ఉంది. ఫార్ములా ఈ రేస్ రద్దు వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం జరిగింది అంటూ వితండవదం చేస్తున్నారు. ఎలాంటి అవినీతి జరగకున్నా కేసులు, కోర్టులంటూ రాజకీయ వేధింపులకు గురి చేస్తున్నారని చేస్తున్న వాదన

## బిజెపి కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయంతో పాటు -బియ్యం బస్తాలు అందజేత

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం చీకోడు గ్రామంలో ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన గున్నాల రమేష్ బాధిత కుటుంబానికి, బిజెపి మండల అధ్యక్షులు సొల్ల క్రాంతి కుమార్, పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసి 25వేల ఆర్థిక సహాయం, 5 బియ్యం బస్తాలు అందజేశారు. బాధిత కుటుంబానికి పార్టీగా అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి మీసా సంజీవ్ , చిట్నేనీ శ్రీనివాస రావు, బాధ నరేష్, గుండవేనీ తిరుపతి, వరి వెంకటేష్, కోలా కృష్ణా, చికోటీ మహేష్, గున్నాల రమేష్ గౌడ్, ఉరడి రాజు, గుగ్గిళ్ళ శివా, బాలేశ్వర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.



## తెలంగాణలో తప్పులు తడకగా కులగణన

### గొప్ప ఘనకార్యం చేసామని చాటింపు-ప్రభుత్వంపై మండిపడ్డ బిజెపి ఎమ్మెల్యే ధన్‌పాల్

**హైదరాబాబాద్,జూన్ 17సమయజ్యోతి:**

తెలంగాణలో కులగణన తప్పుల తడకగా సాగిందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే దన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు.. సర్వే చేసే వారు మా ఇంటికే రాలేదు. బీసీల జనాభా ఎలా తగ్గింది? బీసీల్లో మైనార్టీలను చేర్చడాన్ని భాజపా వ్యతిరేకించిందన్నారు. దీనిని గోరంతలు కొండంతలు చేసి మాట్లాడుతున్నారని మండిపడ్డారు.కాంగ్రెస్ అబద్ధపు హామీలతో ప్రభుత్వంలోకి వచ్చింది. కాంగ్రెస్‌లో జరిగిన అభివృద్ధి కన్నా రెండింతల అభివృద్ధి మోదీ 11 ఏళ్ల పాలనలో జరిగిందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే దన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. భాజపా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 40 ఏళ్ల కల.. పసుపు బోర్డు నిజామాబాద్‌కు వచ్చిందని, జనగణనతోపాటు కులగణన చేపట్టాలని మోదీ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. 'ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యార్థులకు కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వట్లేదు. ప్రభుత్వ పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావట్లేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఎమ్మెల్యే సూర్యనారాయణ డిమాండ్ చేశారు.గత ప్రభుత్వం అందరికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి..ఎన్నికల సమయంలో నిబంధనలకు విరుద్ధంగా కొందరికి ఇళ్లు కేటాయించిందని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్ గౌడ్ విమర్శించారు. 'తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో 2,700 ఇళ్లు కట్టారు. ఆ ఇళ్లను స్థానికులకు కాకుండా దాదాపు 2,500 ఇళ్లను హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఒకే మతానికి చెందిన వారికి ఇచ్చారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా హైకోర్టులో కేసు వేస్తే.. న్యాయస్థానం కీలక తీర్పు ఇచ్చింది. ఇళ్ల కేటాయింపు ఇల్లీగల్ అని పేర్కొంది. ఈ తీర్పు అన్ని ప్రాంతాల్లో కేటాయించిన వారికి వర్తిస్తుంది. స్థానికులకే ఇళ్లు కేటాయించాలని వీరేందర్‌రెడ్డి అన్నారు.

# ఆపరేషన్ కగార్ వెంటనే ఆపాలి

### -ఆపరేషన్‌లో ఆదివాసీలే హతమవుతున్నారు-ఇది ప్రాజస్వామ్య సూత్రాలకు విరుద్ధం

### -మావోలతో వెంటనే శాంతి చర్చలు జరపాలి-ఇందిరాపార్క్ వద్ద మహాధర్నాలో మేధావుల పిలుపు

**హైదరాబాద్,జూన్ 17సమయజ్యోతి:**

ఆపరేషన్ కగార్‌కు నిరసనగా ఇందిరాపార్కు వద్ద అఖిల పక్షాలు మహాధర్నా చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను ఎత్తివేయాలని పలువురు ఈ మహాధర్నాలో డిమాండ్ చేశారు. వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు ప్రారంభించాలని కోరారు. ఈ ధర్నాలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, తమ్మినేని వీరభద్రం, నారాయణమూర్తి, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆపరేషన్ కగార్‌లో ఎక్కువ మంది ఆదివాసీలే చనిపోతున్నారని తెలిపారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతియుత చర్చలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ తమ పార్టీ దృష్టిలో ఆపరేషన్ కార్పొరేట్ కబ్జా అని.. మానవత్వానికి ఇది ఒక మచ్చ అని భారాస నేత దాసోజు శ్రావణ్ విమర్శించారు. అణచివేయాల్సింది మావోయిస్టులను కాదు.. దోపిడీనని ఈ ధర్నాలో పాల్గొన్న సినీ నటుడు, దర్శకుడు ఆర్ నారాయణ మూర్తి అన్నారు. మావోయిస్టులను చంపడం కాదు.. జల్, జంగిల్, జమీన్ నినాదానికి పరిష్కారం చూపించాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వరరావు కోరారు. ఆదివాసీ, పౌర సంఘాలతో భారత రాజ్యాంగం ఆధారంగా చర్చలు జరపాలన్నారు. శాంతి చర్చలు జరపకపోవడం వల్లే ఆదివాసీ ప్రాంతాల్లో అల్లకల్లోలం నెలకొందని చెప్పారు. 'మావోయిస్టులతో చర్చలు జరపాలని మేం అంటే.. మమ్మల్ని మావోయిస్టులు అంటు న్నారు. మేం మావోయిస్టులు అయితే మైకులు ఎందుకు పట్టుకుంటాం.. తుపాకులు పట్టుకునే వాళ్లం'అని అన్నారు. ప్రజా స్వామ్యంలో ఏ సమస్యనైనా చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని రాజ్యాంగం చెబుతోందని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. నక్సలైట్లు చర్చలకు సిద్ధంగా ఉంటే.. ప్రభుత్వం చర్చలు జరపాలని కోరారు. రాజశేఖర్‌రెడ్డి హయాంలో మావోయిస్టులతో చర్చలు జరిపారని, మోదీ ప్రభుత్వం మాత్రం మావోయిస్టులు చర్చలకు సిద్ధంగా ఉన్నా చంపేస్తోందని విమర్శించారు. మావో యిస్టులను చంపడం తాత్కాలిక ఉప శమనమేనని శాశ్వత పరిష్కారం కాదన్నారు. శాంతి చర్చలు జరిపితే పరిష్కారం దొరుకు తుందని మోదీ, అమిత్‌షా గ్రహించాలని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగానికి లోబడి ఉందన్నారు. అడవుల్లోని ఖనిజ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెట్టేందుకే అమిత్ షా .. నక్సలైట్ రహిత దేశంగా చేస్తామం టున్నారని నటుడు ఆర్ నారాయణ మూర్తి ఫైర్ అయ్యారు పాకిస్తాన్ తో చర్చలు జరిపిన కేంద్రం.. భరత మాత ముద్దు బిడ్డలైన మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపడం లేదని ప్రశ్నించారు. అన్యాయాన్ని అడిగిన వాడు నక్సలైట్.. అడగని వాడు ఆల్ రైట్ అనే ఉద్దేశంతో కేంద్రం వ్యవహరిస్తుందని విమర్శించారు.హైదరాబాద్ ధర్నా చౌక్ లో శాంతి చర్చల కమిటీ మహా ధర్నా జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన... అణిచివేయాల్సింది మావో యిస్టులను కాదు దోపిడీని అని అన్నారు. మావోయిస్టులను అంతం చేయడమే లక్ష్యమని అన్నారు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ . ఇది యుద్ధ సమయం కాదు.. చర్చలతోనే పరిష్కరించుకోవాలని మాస్కో సైప్రస్ లో అన్న మోదీ మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపరని ప్రశ్నించారు. మావోలతో చర్చలు జరపకున్నా సరే... ఆదివాసీ సంఘాలతో చర్చలు జరపాలని సూచించారు. భారత రాజ్యాంగం ఆధారంగా చర్చలు జరపండి. దేశంలోని సహజ వనరులను ప్రజల అభివృద్ధి కోసమే వాడాలని రాజ్యాంగంలో తెలిపిందన్నారు. చర్చలు జరిపితే ఆదివాసీ ప్రాంతాల్లో అల్లకల్లోలం ఆగు తుందన్నారు. చర్చలు జరగకుంటే మావో యిస్టులకు ఇబ్బంది లేదు... ప్రభు త్వానికి ఇబ్బంది లేదు. కానీ ఆదివాసీ బిడ్డలకు కష్టం వస్తుంది.. వారి హక్కుల భంగం కలుగు తుందని హెచ్చరించారు. మావోయిస్టులైన భారత పౌరులను చంపుతున్న మోదీ,అమిత్ షా... వీళ్లేం హిందువలని ప్రశ్నించారు. ఇదేనా రామ రాజ్యం అంటే? ఆపరేషన్ కగార్ ను తక్షణమే ఆపేసి శాంతి చర్చలు జరపాలని అన్నారు. కార్పొరేట్ సంస్థల కోసమే ఆదివాసీలపై కేంద్రం యుద్ధం చేస్తుందన్నారు ప్రొఫెసర్ హరగోపాల్. శాంతి చర్చలే అభివృద్ధికి మార్గం అవుతుందన్నారు. హై సందర్భంగా మాట్లాడిన ఆయన చర్చలతో మావోయిస్టుల సమస్యకు పరిష్కారమని అన్నారు. అడవిలోకి కేంద్రం ఎందుకు వెళ్తోంది. ఆపరేషన్ కగార్ ప్రైవేట్ సంస్థల కోసమే ఆపడం లేదని విమర్శించారు. చర్చలతోనే మావోయిస్టు సమస్య పరిష్కారమని హరగోపాల్ అన్నారు..






## నేడు ఎంపిలతో ప్రభుత్వం సమావేశం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,జూన్ 17సమయజ్యోతి:**

గోదావరి-బనకచర్ల లింక్‌ప్రాజెక్టు విషయంలో వపక్షాల నుంచి విమర్శలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తదుపరి అనుసరించాల్సిన కార్యాచరణ కోసం తెలంగాణ ఎంపీలతో రాష్ట్ర ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేసింది. బుధవారం సాయంత్రం 4 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని, రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను గౌరవ అతిథులుగా ఆహ్వానించినట్లు చెప్పారు. కాంగ్రెస్‌తోపాటు భాజపా, భారాస, మజ్లిస్ పార్టీలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలకు లేఖలు రాయడంతోపాటు స్వయంగా ఫోన్ చేసిన ఆహ్వానించామని తెలిపారు. 'ట్రైబ్యునల్, చట్టాలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం చేపట్టిన గోదావరి- బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వానికి అభ్యంతరాలు తెలిపాం. సీఎం రేవంత్‌రెడ్డి, నేను లేఖలు రాశాం. జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కూడా కలిశాం. ఏపీ ప్రతిపాదిస్తున్న ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రజల నీటి హక్కులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం కేంద్ర జల సంఘం వద్ద ఉన్న గోదావరి-బనకచర్ల ప్రీఫీజిబిలిటీ నివేదికను తిరస్కరించాలని కోరాం. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని తదుపరి కార్యాచరణ తీసుకోవడానికి గురువారం ఎంపీలతో సమావేశమై అందరి అభిప్రాయాలు తీసుకోవాలని నిర్ణయించాం'అని ఉత్తమ్ తెలిపారు.

# పిల్లలకై పార్కును ప్రారంభించిన జిల్లా ఎస్పీ

## రానున్న పంచాయితీ ఎన్నికలకు ప్రతి ఒక్కరు సంసిద్ధమై ఉండాలి

### - గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్ ను పరిశీలించిన జిల్లా ఎస్పీ

**సమయజ్యోతి న్యూస్ గుడిహత్నూర్**

చిన్నారులకు చదువుతోపాటు వ్యాయామం నిర్వహిస్తూ ఆటలు ఆడుతూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలియజేశారు. ఈరోజు స్థానిక గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్ నందు పిల్లల పార్కును జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్, ఉట్నూర్ ఎఎస్పి కాజల్ సింగ్ ఐపీఎస్ తో కలిసి పూజాది కార్యక్రమాలు నిర్వహించి, చిన్నారులతో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. దగ్గరలో ఉన్న పిల్లలందరూ చిన్నారుల పార్క్ ను వినియోగించుకొని వ్యాయామం చేస్తూ ఆటలు ఆడుతూ చదువుపై దృష్టి సారిస్తూ వారి బంగారు భవితను ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని సాధించాలని కోరుకున్నారు. అదేవిధంగా గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్ ను పరిశీలించిన జిల్లా ఎస్పీ సిబ్బందితో మాట్లాడుతూ, రానున్న పంచాయితీ ఎలక్షన్లో సిబ్బంది ప్రతి ఒక్కరు గ్రామస్థాయిలో సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకుని విపిఓ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. గ్రామాలలో ఎలాంటి సమస్యలు తలెత్తిన తమకు సమాచారం అందే విధంగా సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలన్నారు. మండల పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా పర్యవేక్షించాలని తెలిపారు. సిబ్బందికి క్రమశిక్షణ తప్పనిసరి అని, విధులలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని తెలిపారు. పోలీస్ స్టేషన్ లో రిసెప్షన్ మరియు పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతతో పోలీస్ స్టేషన్ నిర్వహించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ త్వరితగతిన ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించే విధంగా సిబ్బందిని కేటాయించి వారికి పోలీసుల పట్ల నమ్మకాన్ని పెంపొందించే విధంగా చూడాలన్నారు. పోలీస్ స్టేషన్లో ఉండే రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఉండాలని ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్క రికార్డును కచ్చితంగా క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందని ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా రికార్డుల నిర్వహణ చేపట్టాలని తెలిపారు. కోర్టు డ్యూటీ అధికారి ఎలాంటి ముఖ్యమైన కేసులలోలైన సంబంధిత స్టేషన్ అధికారికి సమాచారం అందించి బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా వ్యవహరించాలన్నారు. పోలీస్ స్టేషన్లో ఎలాంటి అనవసర వాహనాలు లేకుండా దీర్ఘ కాలికంగా పెండింగ్లో ఉన్న కేసులను పూర్తి చేయాలని సూచించారు. డయల్ 100 పోలీస్ సిబ్బంది గ్రామ గ్రామాన సందర్శిస్తూ పోలీసులు తమ కోసం విధులు నిర్వహిస్తుంటారని, పోలీసు మీకోసం కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఎలాంటి అత్యవసర సమయంలో నైన డయల్ 100 ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఎఎస్పి కాజల్ సింగ్ ఐపీఎస్, ఇచ్చోడా సీఐ కె రాజు, పిఎస్సై మధు కృష్ణ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## కలెక్టర్ రాజశ్రీ షా చేతుల మీదిగా ప్రశంస పత్రం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిది ఆదిలాబాద్**



ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా చేతుల మీదుగా సామాజిక సంఘ సేవకులు పసుపుల రాజు ప్రశాంత పత్రాన్ని అందుకున్నారు. సామాజిక సేవకులుగా గత కొన్ని సంవత్సరాలుగా వివిధ రంగాల్లో సేవలందించిన రాజు ఇప్పటివరకు 28 సార్లు రక్తదానాన్ని చేశారు. రక్తదానం చేసినందుకు గాను ప్రపంచ రక్త దాతల దినోత్సవ సందర్భంగా రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కళాశాల ఆవరణలోని రిమ్స్ ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ జయసింగ్ రాథోడ్ లా చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పసుపుల రాజు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ మరియు అధికారుల చేతుల మీదుగా స్వచ్ఛంద రక్తదానం చేసిన దుగ్గాను అవార్డు ప్రశాస పత్రం ఇవ్వడం ఎంతో సంతోషకరంగా ఉందని తెలిపారు. గత 20 సంవత్సరాల నుండి ఇప్పటివరకు సంఘసేవకే అంకితమయ్యామని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా సంఘసేవనే చేయడంలో ముందుంటామని తెలిపారు. అవసరమైన వారికి రక్తదానం చేయడంలో ముందున్నామని గతం లో రత్న ఆనం పై అవగాహన లేకపోవడం వల్ల రక్తదానం చేసేందుకు ఎవరు ముందుకు వచ్చేవారు కారని ఆ సమయంలో రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చామని ఇప్పటివరకు 28 సార్లు రక్తదానం చేశామని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా అనేక రకాల సేవా కార్యక్రమాలను చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తన సేవలను గుర్తించి ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా అవార్డు అందుకోవడం ఎంతో సంతోషకరంగా ఉందని తెలిపారు

## అరుణాచలేశ్వర్ ఆలయాన్ని దర్శించుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్

**సమయజ్యోతి న్యూస్ జూన్ 17 బజార్ హత్నూర్**

తన జన్మదిన సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ కుటుంబ సభ్యులతో కలిసి అరుణాచలేశ్వర్ ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నియోజక వర్గ ప్రజలు సుఖ సంతోషతో ఉండాలని దేవుని మొక్కినట్లు ఆయన తెలిపారు



## ఇంద్రవెల్లి మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాదు :**

జిల్లా ఆదిలాబాద్,ఇంద్రవెల్లి మండలం దస్నాపూర్ గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యు సదస్సును,వైద్య శిబిరాన్ని మంగళవారం జిల్లా జిల్లా రాజర్షి షా పరిశీలించారు.ఇంద్రవెల్లి మండలంలో పర్యటిస్తూ పిట్టబొంగరం లో అమరవీరులకు,ఇతర లబ్ధిదారులకు కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను సబ్ కలెక్టర్ యువరాజ్ తో కలసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు.



## భూ భారతి అవగాహణ సదస్సు లో పాల్గొన్న ఆర్ డి ఓ వినోద్

**సమయజ్యోతి న్యూస్ జూన్ 17**

**బజార్ హత్నూర్**

బజార్ హత్నూర్ మండలం లోని పిప్పిరి గ్రామంలో భూ భారతి అవగాహణ సదస్సు లో ఆర్ డి ఓ వినోద్ పాల్గొని అనంతరం ఆయన మాట్లాడుతూ భూ తగాదాలు పరిష్కారం కోసం ప్రభుత్వం భూ భారతి తీసుకు వచ్చింది అని పేర్కొన్నారు ప్రజలు ఆ అవకాశమును సద్వినియోగం చేసుకోవాలి అని పేర్కొన్నారు భూ సమస్య లకు 35 అప్లికేషన్ వచ్చినవి ఈ కార్యక్రమంలో ఉప తహశీల్దార్ హీరా లాల్ ఆర్ ఐ నూర్ సింగ్ సంజీవ్ జూనియర్ అసిస్టెంట్ రమేష్ రికార్డు అసిస్టెంట్లు ఆశతాయి గౌతం ఎ ఈ ఓ చౌహాన్ కృష్ణా పాల్ తదితరులు పాల్గొన్నారు



## నేడు ఆత్మకూరు కు మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి రాక

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆత్మకూరు వనపర్తి జిల్లా.

ఆత్మకూరు మండల కేంద్రానికి బుధవారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, క్రీడల యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి విచ్చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు ఎం.డి.రహీమతుల్లా తెలిపారు. గాంధీ చౌక్ నుండి మంత్రికి తిరుమల సాయి ఫంక్షన్ హాల్ వరకు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలకాలని కోరారు. అనంతరం మంత్రి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు,కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ, సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, మహిళలు, యువకులు,శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



## పుకార్లను నమ్మవద్దు, విద్యార్థుల తరగతులు యథావిధిగా కొనసాగుతున్నాయి -జిల్లా కలెక్టర్

సమయజ్యోతి న్యూస్, నిర్మల్ బ్యూరో, జూన్ 17.

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని రాజుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల గేటుకు సోమవారం కాంట్రాక్టర్ తాళం వేసిన ఘటనపై జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి పాఠశాల తెరిపించింది. ప్రస్తుతం విద్యార్థులు యథావిధిగా తరగతులకు హాజరవుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి అనవసర పుకార్లు, అపోహలు వ్యాపిస్తున్నాయి. పుకార్లను నమ్మవద్దని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి అసత్య ప్రచారాలు చేయడం ద్వారా గందరగోళం సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా ప్రజలు, తల్లిదండ్రులు ఏవిధమైన భయాందోళన లేకుండా విద్యార్థులను పాఠశాలకు పంపాలని జిల్లా యంత్రాంగం స్పష్టం చేసింది.



## కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంటింటికి ప్రచారం

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రచారం చేయడంతో పాటు, సంక్షేమ పథకాలు అందని అర్హులైన లబ్ధిదారులను గుర్తించారు. ఈ కార్యక్రమం 6వ, 14వ బూతులలో నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్ ఖాన్, గడ్డం రవి, డిష్ వెంకటేష్, హరికృష్ణ, గోపుశన్న నవీన్, పాల్గొన్నారు.



# కోదండ రాం నీ కలిసిన జిల్లా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిది ఆదిలాబాద్

గత మూడు నెలలుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వేతనాలు అందక అనేక అవస్థలు పడుతున్నామని , ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఈ సంవత్సరం రెన్యువల్ ఇంకా జరగలేదని, దానితో సంబతిత ఏజెన్సీ లు వేతనాలు చెల్లించడం లేదని అలాగే ఔట్ సోర్సింగ్ విధానం వలన అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నాం అని వెంటనే కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనీ వినతి పత్రం అందించారు, ఈ సందర్భంగా ప్రో కోదండరాం స్పందించి ముఖ్యమంత్రికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనీ అలాగే పెండింగ్ వేతనాలు చెల్లించాలని ముఖ్య మంత్రి కి లేఖ ద్వారా తెలిపారు, ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బండ శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు రామగిరి సంతోష్, జ్ఞానేశ్వర్, రవి కుమార్, రాము తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు



# ప్రణాళిక సంఘం చైర్మన్ జి.చెన్నారెడ్డి ని కలిసిన ఆదిలాబాద్ జిల్లా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

హైదరాబాద్ ప్రజా భవన్ లో మంగళవారం ప్రణాళిక సంఘం చైర్మన్ జి. చెన్న రెడ్డి ని ఆదిలాబాద్ జిల్లా ఔట్ సోర్సింగ్ జేఏసీ నాయకులు కలిశారు.ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి జి.చెన్న రెడ్డి కి వివరించారు.ఈ ఆర్థిక సం.2025-2026 కు గాను రెన్యువల్ లేక ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు రెండు మూడు నెలల నుండి వేతనాలు లేక ఇబ్బంది పడుతున్నారని ఆయన తో చెప్పారు.వెంటనే రెన్యువల్ ఇవ్వాలని వారు కోరారు.అలాగే కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ విధానం ఇంకా అమల్లోనే ఉందని,మనతో విడిపోయిన ఆంధ్ర ప్రదేశ్ లో మాత్రం ఏజెన్సీ విధానం రద్దయి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కార్పొరేషన్ చేశారని చెప్పారు.మన తెలంగాణ లో మాత్రం ఏజెన్సీ విధానాలు ఇంకా కొనసాగుతున్నాయని,ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి కార్పొరేషన్ ద్వారానే వేతనాలు చెల్లించాలన్నారు.అదే విదంగా మహిళలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవలు ఇవ్వాలని మరియు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలనీ అదే విధంగా అవుట్ సౌర్సింగ్ ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబానికి పది లక్షల ఎక్సగ్రెసియా ఇవ్వాలని మరియు ఆ కుటుంబంలో ఒకరికీ ఉద్యోగం ఇవ్వాలని కోరడం జరిగిందన్నారు.ప్రణాళిక సంఘం చైర్మన్ జి.చెన్న రెడ్డి కూడా సానుకూలంగా స్పందిస్తూ మీ సమస్యలను ప్రభుత్వం ద్రుష్టి కి తీసుకెళ్తానని చెప్పారని తెలిపారు.ఈ సందర్భంగా కలిసిన వారిలో ఔట్ సోర్సింగ్ జేఏసీ అదిలాబాద్ జిల్లా అధ్యక్షులు బండ శ్రీను,వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్లూరి రవి,రాష్ట్ర అవుట్సోర్సింగ్ జేఏసీ ఉపాధ్యక్షులు రామగిరి సంతోష్,మీడియా కన్వీనర్ జ్ఞానేందర్,తోట రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.




# రైతుల ఖాతాలలో వానాకాలం పంట పెట్టుబడి నిధులు జమ

## రైతు భరోసాతో అన్నదాతకు ఆదరువు కల్పించిన ప్రభుత్వం

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్ బ్యూరో

వ్యవసాయాన్ని పండుగలా మారుస్తూ, రైతులకు బాసటగా నిలవాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న లిరైతు భరోసాలి పథకం వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన నిజామాబాద్ జిల్లాలోని చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తోందని కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు.వానాకాలం - 2025 సీజన్ కు సంబందించి పంట పెట్టుబడి సాయం క్రింద జిల్లాలో 2,98,472మంది రైతులకు రూ. 326.03 కోట్ల నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో జమ చేస్తోందని అన్నారు. రైతుల బ్యాంకు ఖాతా వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులు ఇప్పటికే రైతు భరోసా పోర్టల్ లో నమోదు చేశారని అన్నారు. ఈ వివరాలకు అనుగుణంగా మంగళవారం సాయంత్రం వరకు జిల్లాలోని 2,12,172 మంది రైతుల ఖాతాలలో రూ. 160.72 కోట్ల నిధులు ఇప్పటికే జమ అయ్యాయని కలెక్టర్ వివరించారు. పెట్టుబడి సాయం ప్రారంభించిన మొదటి రోజైన ఈ నెల 16వ తేదీన రెండు ఎకరాల లోపు వ్యవసాయ భూమి కలిగిన జిల్లాలోని 1,681,66 మంది రైతుల ఖాతాలలో ఎకరాకు ఆరు వేల రూపాయల చొప్పున రూ. 95.66 కోట్ల పంట పెట్టుబడి సాయం నిధులను ప్రభుత్వం వారి ఖాతాలలో జమ చేసిందని తెలిపారు. తాజాగా మంగళవారం మూడెకరాల వరకు సాగు భూమి ఉన్న 44,006 మంది రైతుల ఖాతాలలో రూ. 65.06 కోట్ల నిధులు జమ చేసిందని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి వివరించారు. మొదటి రెండు రోజులలోనే మొత్తంగా జిల్లాలో 2,12,172 మంది రైతుల ఖాతాలలో రూ. 160.72 కోట్ల నిధులు జమ అయ్యాయని అన్నారు. మిగతా రైతులకు కూడా ఎన్ని ఎకరాలు ఉంటే అన్ని ఎకరాలకు పంట పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం రైతు భరోసా నిధులను వారి వారి ఖాతాలలో జమ చేయనుందని తెలిపారు. పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు రైతు భరోసా ఉపయుక్తంగా నిలుస్తుందని కలెక్టర్ అన్నారు. కాగా, ఇచ్చిన హామీ మేరకు వానాకాలం సాగు ప్రారంభానికి ముందే ప్రభుత్వం రైతు భరోసా నిధులు అందించడం పట్ల రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.



# పశ్చిమాసియాలో మరింత ఉద్రిక్తత

## -జీ7 సదస్సును వీడిన అమెరికా అధ్యక్షుడు

## -హుటాహుటిన స్వదేశం యూఎస్‌కు ట్రంప్

**వాషింగ్టన్,జూన్17సమయజ్యోతి:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హడావుడిగా స్వేదశం బయలుదేరి వెళ్లారు. కెనడా వేదికగా జరుగుతున్న జీ7 వేదికను వీడి అమెరికాకు తిరుగు ప్రయాణం కావడంతో.. సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. టెహ్రాన్ గగనతలాన్ని పూర్తిగా అధీనంలోకి తీసుకొన్నామని ఇజ్రాయెల్ ప్రకటించిన వేళ.. ఈ పరిణామాలు చోటుచేసు కొన్నాయి. ఆ నగరవాసులు నివాసాలు ఖాళీ చేసి వెళ్లిపోవాలని ట్రంప్ స్వయంగా హెచ్చరికలు జారీ చేయడం దీనికి ఆజ్యం పోసినట్లైంది. ట్రంప్ హడావుడిగా సిట్యుయేషన్ రూమ్‌ను సిద్ధం చేయించి.. వాషింగ్టన్‌కు తిరిగిరావడంతో.. అమెరికా కూడా ఇరాన్ అణుకేంద్రాలను ధ్వంసం చేయడంలో ఇజ్రాయెల్‌తో చేతులు కలపనుందనే ప్రచారం జోరందుకుంది. ఇందుకోసం దాదాపు 20 అడుగుల పొడవుండే జీబీయూ-57 అనే భారీ బంకర్ బస్టర్ బాంబును వాడాల్సి ఉంటుంది. ఇది సుమారు 13,600 కిలోల బరువు ఉంటుంది. దీనిని కేవలం అమెరికాకు తురుపు ముక్క అయిన బి-2 స్పిరిట్ బాంబర్లు మాత్రమే ప్రయోగించగలవు. కొన్ని నెలల క్రితమే ఈ రకానికి చెందిన దాదాపు 5 యుద్ధ విమానాలను పశ్చిమాసియా సమీపంలోని డియాగో గార్సియా బేస్‌కు చేర్చింది. దీనికితోడు రీఫ్యూయలింగ్ ట్యాంకర్లు, ఇతర యుద్ధ విమానాలు, ఆయుధాలను అమెరికా పశ్చిమాసియాకు తరలిస్తోంది. అమెరికా విమాన వాహక నౌక యూఎస్ఎస్ నిమిట్జ్ కూడా ఇప్పటికే ఈ దిశగా బయల్దేరింది. ఓ పోర్టు విజిట్‌ను కూడా రద్దు చేసుకొని ఇది పశ్చిమాసియాకు ప్రయాణం కట్టడం గమనార్హం. దీంతోపాటు డెస్ట్రాయర్లు ఇతర సహాయక నౌకలు కూడా వస్తున్నాయి. బ్రిటన్ కూడా తన ÷టైర్‌జెట్లను మోహరిస్తోంది. అమెరికా కూడా ఇజ్రాయెల్‌తో కలిసి యుద్ధం చేస్తుందన్న ప్రచారంపై ప్రముఖ వ్యాఖ్యాత టకర్ కార్ల్‌సన్ ట్రంప్‌ను విమర్శించారు. దీనికి అమెరికా అధ్యక్షుడు తనదైనశైలిలో స్పందిస్తూ 'ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండకూడదు అన్న విషయాన్ని ఎవరైనా ఆ టకర్ కార్ల్‌సన్‌కు వివరించండి' అని వెటకారంగా చెప్పడం గమనార్హం. దీంతోపాటు సోషల్ మీడియా పోస్టులో కూడా ఇరాన్‌కు అణ్వాయుధం అందదు అని ట్రంప్ తేల్చిచెప్పారు. దీంతో ఆ దేశ అణు కేంద్రాలపై అమెరికా దాడి జరపొచ్చనే ప్రచారానికి బలం చేకూరుతోంది. మరోవైపు, ఇజ్రాయెల్- ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం గురించి ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ చేసిన వ్యాఖ్యలను ట్రంప్ ఖండించారు. 'నేను జీ7 సదస్సును ఎందుకు వీడుతున్నానో మేక్రాన్ తప్పుగా అర్థం చేసుకున్నారు. నేను వాషింగ్టన్ ఎందుకు వెళు తున్నానో ఆయనకు తెలియదు. కాల్పుల విరమణ ఒప్పందం గురించి కాదు.. అంతకంటే పెద్దదే జరగబోతోంది' అని ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో పోస్ట్ పెట్టారు. ఇకపోతే ఇరాన్‌లోని అణుకేంద్రాలు పెద్దగా దెబ్బతినలేదని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ అధిపతి రఫాలే గ్రూసీ వెల్లడించారు. శుక్రవారం చేసిన దాడులు మినహా మిగిలినవి పెద్దగా వీటిపై ప్రభావం చూపలేదనే అభిప్రాయం వ్యక్తంచేశారు. నతాంజ్‌లోని భూగర్భ అణుశుద్ధి కేంద్రంపై పెద్దగా వీటి ప్రభావం లేదని పేర్కొన్నారు. విద్యుత్తు సరఫరా అంతరాయాలు వంటివి చోటుచేసుకొని మొత్తం 15,000 సెంట్రిఫ్యూజ్‌లు దెబ్బతిని ఉండొచ్చన్నారు. అంతేకానీ ఇవి ధ్వంసమై ఉంటాయని తాము అనుకోవటం లేదని వెల్లడించారు. నతాంజ్, ఫార్డో అణు కేంద్రాలు భూగర్భం లో లోతుగా



నిర్మించారు. వీటిని పేల్చేయాలంటే అత్యంత భారీ శ్రేణికి చెందిన జీబీయూ-57 బంకర్ బస్టర్ బాంబులు అవసరం. అవి అమెరికా వద్ద మాత్రమే ఉన్నాయి. ఇరాన్‌లోని ఫార్డో అణుకేంద్రంలో యురేనియంను 60 శాతం శుద్ధి చేయగలరు. ఇది అణుబాంబులు తయారీ చేయడానికి అవసరమైన దానికి చాలా సమీపంలో ఉన్నట్లే లెక్క. 2023లో అంతర్జాతీయ అణుశక్తి సంస్థ ఈ కేంద్రంలో 83.7శాతం శుద్ధి చేసిన యురేనియంను గుర్తించింది. అణుబాంబుకు అవసరమైన 90 శాతానికి ఇది చాలా దగ్గరగా ఉంది. ఫార్డో కేంద్రాన్ని ఓ పర్వతం లోపల సొరంగాలు చేసి నిర్మించారు. ఇక్కడ 3,000 సెంట్రిఫ్యూజులు ఉన్నట్లు అంచనా. దీనిని సాధారణ బాంబులు ధ్వంసం చేయలేవు. ఇరాన్ నుంచి అణుబాంబు తయారీని దూరం చేయాలంటే దీనిని ధ్వంసం చేయడం అమెరికా, ఇజ్రాయెల్‌కు చాలా ముఖ్యం.

# గత ప్రభుత్వ హయాంలో ఫోన్ల ట్యాప్

## -మా ఫోన్ ట్యాప్ జరిగిందనే అనుమానం-కెసిఆర్,కెటిఆర్‌లు సిగ్గుతో తలదించుకోవాలి

## - టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

**హైదరాబాద్,జూన్ 17సమయజ్యోతి:** గత ప్రభుత్వం తమ ఫోన్‌లను ట్యాప్ చేసినట్లు అనుమానం రావడంతోనే సీఎస్‌కు ఫిర్యాదు చేసినట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణకు ఆయన హాజరయ్యారు. ఈ కేసులో సాక్షిగా ఆయన తన వాంగ్మూలం ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'టెలిగ్రాఫ్ చట్టానికి తూట్లు పొడుస్తూ మా ఫోన్లను ట్యాప్ చేశారు. రాజకీయ నాయకుల ఫోన్లు ట్యాప్ చేయడం హేయమైన చర్య. ఈ చర్యకు పాల్పడిన కేసీఆర్, కేటీఆర్ సిగ్గుతో తలవంచుకోవాలి. రాజకీయాల్లో భాగాన నేతలే ఉండాలనే దురుద్దేశంతో మా ఫోన్లు ట్యాప్ చేశారు. గతంలో కాంగ్రెస్ ఓడిపోవడానికి ఫోన్ల ట్యాపింగే కారణమని తెలుస్తోంది. రేవంత్ రెడ్డితో పాటు నా ఫోన్ కూడా ట్యాప్ చేసి మా కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఇదే ఫిర్యాదును గతంలోనూ చేశాను. ఇవాళ వాస్తవాలు బయటకు వచ్చాయి. చట్టానికి వ్యతిరేకంగా అనేకమంది ఫోన్లను ట్యాప్ చేశారు. 2022 నుంచి సీనియర్ కాంగ్రెస్ నాయకుల ఫోన్లు ట్యాపింగ్‌లో ఉన్నాయి. సిట్ దర్యాప్తులో 650 మంది కాంగ్రెస్ నాయకుల పేర్లు జాబితాలో ఉన్నాయని తెలిసిందన్నారు. 'కుంభం అనిల్ కుమార్ యాదవ్, గాలి అనిల్‌తోపాటు అనేకమంది ఫోన్లు ట్యాప్ అయినట్లు బయటికి వచ్చింది. ఇవన్నీ చూస్తుంటే, నాడు ఏ రకంగా అధికారాన్ని దుర్వినియోగం చేసి దుశ్చర్యకు పాల్పడ్డారో అర్థమవుతోంది. ప్రజాస్వామ్యంలో నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన అధికారులు రాజకీయ నాయకులకు తలొగ్గి అడుగులకు మడుగులొత్తారు. ప్రైవసీ అనేది మా ప్రాథమిక హక్కు. దాన్ని కాలరాశారు. పదవీ విరమణ చేసిన ప్రభాకర్‌రావును దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పెట్టారు. నక్సలైట్లకు సానుభూతిపరులుగా ఉన్నారని ముమ్మల్ని ట్యాప్ చేయడం సిగ్గుచేటు. కేటీఆర్ సిగ్గుతో తల దించుకోవాలి' 'ఆనాడు మా ఫోన్లు ట్యాప్ చేసి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నం చేశారు. దానికి మీరు శిక్షార్హులు. భవిష్యత్తులో ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి దుశ్చర్యకు పాల్పడకుండా ఉండాలంటే వీరికి శిక్ష పడాల్సిందే. ఇలాంటి దిగజారుడు పనికి ఒడిగట్టిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు కూడా శిక్ష పడాలి. సజావుగా విచారణ జరిపి... రాజకీయ నాయకులైనా, అధికారులైనా... బాధ్యులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం' అని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో (ఖలీసి ఃఒఅతిరిణ అజీబ) సిట్ అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసులో బాధితుల నుంచి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసే ప్రక్రియను సిట్ మొదలుపెట్టింది. ఇప్పటికే కొంతమంది బాధితుల స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసిన సిట్.. తాజాగా ఈ కేసులో సాక్షిగా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వాంగ్మూలాన్ని రికార్డు చేయాలని నిర్ణయించింది. ఆయనకు సమాచారం అందించారు. ఇందులో భాగంగా మంగళవారం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు మహేష్ కుమార్ చేరుకున్నారు. దీంతో జూబ్లీహిల్స్ పీఎస్ ముందు కాంగ్రెస్ కార్యకర్తల హడావిడి నెలకొంది. సిట్ కార్యాలయానికి పెద్దఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు చేరుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్లేందుకు యత్నించిన కార్యకర్తలను పోలీసులు అడ్డుకుని బయటకు పంపించి వేశారు. ఈ క్రమంలో పోలీసులకు, కార్యకర్తలకు మధ్య స్వల్ప తోపులాట చోటు చేసుకుంది. కాగా... ప్రస్తుతం టీపీసీసీ చీఫ్‌గా వ్యవహరిస్తున్న మహేష్ కుమార్.. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఆ సమయంలో తన ఫోన్‌ను ట్యాప్ చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇదే అంశంపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరోవైపు ప్రణీత్ రావును అరెస్ట్ చేసి ఆయనకు సంబంధించి ఫోన్లను రికవరీ చేసిన సమయంలో అందులోని డేటాను విశ్లేషించారు.. మహేష్ కుమార్ గౌడ్‌కు చెందిన అంశాలు బయటపడ్డాయి. దీంతో ఆయన ఫోన్ ట్యాప్ అయినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో మహేష్ కుమార్‌ను బాధితుడిగా భావించి ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేయాలని నిర్ణయించారు.

# బిఆర్ఎస్ ఫోన్ ట్యాపింగ్‌తోనే కాంగ్రెస్ ఓటమి

## -వందలాది కాంగ్రెస్ నేతల ఫోన్లు ట్యాప్-బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

## -ఈ వ్యవహారంలో కెటిఆర్ సిగ్గుతో తలదించుకోవాలి

## -జూబ్లీహిల్స్ పోలీసుల ఎదుట వాంగ్మూలం ఇచ్చిన మహేశ్ కుమార్

**హైదరాబాద్,జూన్ 17సమయజ్యోతి:** ఫోన్ ట్యాపింగ్ కేసులో కెసిఆర్ సిగ్గుతో తలదించుకోవాలని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఆనాడు అధికారంలో ఉన్న కెసిఆర్, కెటిఆర్‌లు వేలాదిమంది కాంగ్రెస్ నేతల ఫోన్లు టాప్ చేశారని అన్నారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీసుల ఎదుట వాంగ్మూలం ఇచ్చారు. అనంతరం టీపీసీసీ మీడియాతో మాట్లాడుతూ.. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఓటమికి ఫోన్ ట్యాపింగే కారణమన్నారు. ఎలాంటి అధికార హోదా లేని వ్యక్తికి అధికారాన్ని కట్టబెట్టి తమ ఫోన్‌లను టాప్ చేయించారని ఆరోపించారు. నక్సలైట్ల సానుభూతిపరుల పేరుతో తమ ఫోన్లు టాప్ జరిగాయన్నారు. ఈనాడు కేటీఆర్ తాము నీతివంతులం, నిజాయితీపరులమని అంటున్నారని... ఆయన సిగ్గుతో తలదించుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ దుర్మార్గపు చర్య అని అన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ నాయకుల ఫోన్లు ట్యాపింగ్ జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వందలాది మంది నాయకుల ఫోన్లను చట్టానికి వ్యతిరేకంగా ట్యాప్ చేశారని మండిపడ్డారు. రాజకీయ నేతల ఫోన్లు ట్యాపింగ్ చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. ఆనాటి సీఎం, కేటీఆర్‌లు సిగ్గుతో తలవంచుకోవాలని వ్యాఖ్యలు చేశారు. ఏ రాజకీయ నేత, పార్టీ ఉండకూడదని.. తామే శాశ్వతంగా అధికారంలో ఉండాలనే దుర్బుద్ధితో ఫోన్ ట్యాపింగ్‌కు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ మూమెంట్స్ అన్ని కూడా ట్రాక్ చేశారని మండిపడ్డారు. 2022 నుంచి కాంగ్రెస్ నాయకుల ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్నారు. 650 మంది కాంగ్రెస్ నాయకుల ఫోన్లు ట్యాపింగ్ జరిగిందని తెలిపారు. మా ఫోన్లను ట్యాప్ చేసి రాజకీయ లబ్ది పొందాలని చూశారని ఆరోపించారు. నిజాయితీ గల సిట్ అధికారులు ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నారన్నారు. భవిష్యత్‌లో మరే ప్రభుత్వం కూడా ఇలాంటి దుశ్చర్యకు పాల్పడకుండా ఉండాలంటే ఈ కేసులో నిందితులకు శిక్ష పడాల్సిందే అని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఎవ్వరినీ ఉపేక్షించవద్దన్నారు. విచారణను సజావుగా జరిపి ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారికి శిక్ష పడేలా చూడాలని ప్రభుత్వానికి వినతి చేశారు. దేశ చరిత్రలో ఇంత మంది ఫోన్లు ట్యాప్ చేయడం ఇదే ప్రథమమన్నారు. హైకోర్టు, సుప్రీం కోర్టు ఈ కేసును తీవ్రంగా పరిగణించి నిందితులను శిక్షించాలని కోరారు. ఆనాటి నేతలు వారి అవసరాల కోసం రాజకీయ నాయకులు, జడ్జిలు, విలేకర్లతో పాటు వారి హయాంలో పని చేసిన అధికారుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వారి అవసరాలకు అనుగుణంగా ఫోన్ ట్యాపింగ్‌ను వాడుకుందని ఆరోపించారు. 2023 ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసి హార్డ్ డిస్క్‌లను ప్రభాకర్ రావు ధ్వంసం చేయించారన్నారు. ప్రభాకర్ రావు, అప్పటి చీఫ్ సెక్రటరీ కలిసి హార్డ్ డిస్క్‌లు ధ్వంసం చేశారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

# ట్రంప్ తీరుతో అమెరికాలో అనిశ్చితి

## ఇప్పటికీ తేరుకోలేక పోతున్న భారత విద్యార్థులు

**వాషింగ్టన్,జూన్17సమయజ్యోతి:** హెచ్‌1బి వీసాలను అనియావాసులు దుర్వినియోగం చేస్తున్నారనీ ఉన్నత చదువులకోసం వచ్చి ఉద్యోగాలను ఎగరేసుకుపోతున్నారనీ ప్రస్తుతం అమెరికాలో చెలరేగిపోతున్న విమర్శల వెనుకా మెజారిటీ శ్వేత జాతీయవాద విపరీత పోకడ వెల్లడవుతోంది. అమెరికన్ల ఉద్యోగాలను కొల్లగొట్టున్నారన్న విమర్శ ఆనియావాసులను ప్రస్తుతం సంక్షోభంలోకి నెడుతోంది. దీనికితోడు విదేశీ కార్యక్రమాలు, ఆంక్షలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఆందోళనలు వస్తున్నా ట్రంప్ లెక్క చేయడం లేదు. లాస్‌ఏంజెల్స్ ఆందోళనలను సైన్యంతో అణిచివేయించారు. చదువు ముగిసిన తర్వాత ఉద్యోగాలు చేసే కాలాన్ని బాగా తగ్గించాలనే డిమాండు ఊపందుకుంటోంది. ఇది జరిగితే బాగా నష్టపోయేది భారతీయులే. లక్షలు ఖర్చుపెట్టి అమెరికాలో చదువుతున్న మొత్తం విదేశీ విద్యార్థుల్లో 25 శాతం పైగా భారతీయులే ఉన్నారు. అభివృద్ధిచెందిన దేశాల్లో పలుచోట్ల జనాకర్షక, ఉన్మాద నినాదాలతో ఒట్ల రాజకీయాల్లో పైచేయి సాధిస్తున్న నేతల్లో విపరీత జాతీయవాద పోకడలు లేని వాళ్లను వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక ఈ విపరీతం మోతాదు బాగా మించిపోతోంది. వలసదారులకు, శరణార్థులకు సురక్షిత ప్రదేశంగా ఉన్నప్పుడే అమెరికా ఘనత గొప్పగా ఉంటుందని కెన్నడీ ప్రగాఢంగా చెప్పారు. పౌరహక్కుల చట్టాల లేకపోతే ప్రజాస్వామ్యం గురించి, సమన్యాయపాలన గురించి, పౌరసమానత్వం గురించి ప్రపంచానికి నీతులు చెప్పే నైతిక అర్హతే అమెరికాకు ఉండేది కాదు. అవకాశాల సీమగా ఇప్పటికీ అమెరికాను పరిగణిస్తూ ప్రతి ఏటా దాదాపు లక్షల మందికి పైగా ప్రజలు అక్కడికి వెళుతున్నారు. 2021-24 మధ్య సగటున ఏడాదికి 24లక్షల మంది అక్కడికి చేరుకున్నారు. 1965 నుంచి చూస్తే క్రమేపీ లాటిన్ అమెరికా, ఆసియా నుంచి అమెరికాకు వెళ్లే వారి సంఖ్య బాగా పెరిగింది. మొత్తం వలసదారుల్లో 50 శాతం వారే ఉన్నారు. ఇంతగా వెళుతున్న వారందరికీ అక్కడ సమభావనతో సమాజంలో స్వాగతం లభిస్తోందని ఇప్పటికీ చెప్పలేం. ఎన్నోరూపాల్లో శ్వేతజాతి ఆధిక్యతా ధోరణులు ఎదురవుతున్నాయి. వలసల చరిత్రలోని విషాదాలనూ రాజకీయాలనూ జాతి ఆధిక్యతా ధోరణులనూ తెలుసుకుంటేనే ఇవాటి ట్రంప్ విధానాలు నేపథ్యమూ అర్థం అవుతుంది. అమెరికా ఆధిక్యతకూ శ్వేతవర్గానికీ పెద్దపీట వేయాలనే తర్వానికీ ట్రంప్‌తో మళ్లీ ఊపు వచ్చినా దాని మూలాలు ఇప్పటివి కావు! ఆధిపత్య భావజాలాలపై ఆధారపడిన జాతీయవాదాలు ఎక్కడైనా నిలువరించాల్సిందే.

# స్థానిక ఎన్నికలపై ఫీవర్

## పలకరింపులతో హల్‌చల్

**నిజామాబాద్,జూన్17సమయజ్యోతి:** బీసీ గణనకు సంబంధించి కమిషన్ల రిపోర్టులు ఆధారంగానే రిజర్వేషన్లు పెంచి లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. బహుశా జులైలో స్థానిక ఎన్నికలు జరిగే ఛాన్స్ ఉందంటూ వార్తలు వస్తున్నాయి. 42శాతం బిసి రిజర్వేషన్లు ప్రకటించాలని బిఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. ఇవిప్రకటించి ఎన్నికల్లోకి చాటుకోవాలని మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. రిజర్వేషన్లు ప్రకటించకుండా స్థానిక ఎన్నికలకు వెళితే ఊరుకోమని ఎమ్మెల్సీ కవిత హెచ్చరించారు. ఇకపోతే ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని బిఆర్ఎస్ భావిస్తోంది. స్థానిక ఎన్నికల్లో ఫుట్‌బాల్ ఆడుతామని కెటిఆర్ ప్రకటించారు. తుది ఓటర్ల జాబితాను అధికారులు ఇటీవల ప్రకటించారు. తాజాగా జిల్లాలో 14,35,214 మంది ఓటర్లుండగా పురుషులకన్నా 80,875 మంది మహిళా ఓటర్లు ఎక్కువ ఉన్నట్లు లెక్క తేలింది. మహిళల తర్వాత యువ ఓటర్లే కీలకం కానున్నారు. కొత్తగా ఓటు హక్కు పొందినవారు 26 వేల వరకు ఉన్నారు. మొత్తం ఓటర్లలో యువతీయువకులే దాదాపు సగం వరకు ఉన్నారు. కొత్త జాబితా ప్రకారం 18 నుంచి 39 ఏండ్ల మధ్య వయస్సున్న ఓటర్ల సంఖ్య 6, 96,014. దీంతో రానున్న లోకల్ బాడీ ఎన్నికల్లో మహిళలు, యువతే కీలకం కానున్నారు. దీంతో యువతలో కూడా సర్పంచ్ పదవులపై ఆశ కనిపిస్తోంది. పంచాయితీలతో పాటు వాటి పరిధిలోని 5,022 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. బ్యాలెట్ బాక్స్ లతో పాటు పేపర్ బ్యాలెట్ రెడీ చేశారు. జిల్లాలో 31 మండలాలున్నాయి. పంచాయతీ ఎన్నికల తర్వాత ఈ మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలన్నింటి లోనూ యువత, మహిళలే నిర్ణేతలు కానున్నారు. వారు ఎవరివైపు మొగ్గు చూపితే వాళ్లే అందలమెక్కే ఛాన్సుందని అంటున్నారు. గత ఏడాది ఫిబ్రవరిలోనే సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. జులైలో ఎంపీటీసీ, జడ్పీటీసీలు కూడా మాజీలయ్యారు.మున్సిపల్ కార్పొరేషన్లు, కౌన్సిళ్ల టర్మ్ పూర్తికానుంది. దీంతో రూరల్, అర్బన్ లోకల్ బాడీలకు వరుసగా ఎన్నికలు జరగనున్నాయి. కొత్తగా 15 గ్రామ పంచాయ తీలు ఏర్పడడంతో జిల్లాలో పంచాయితీల సంఖ్య 545 పెరిగింది. ఈ క్రమంలో జిల్లాలో అప్పుడే స్థానిక హడావిడి మొదలయ్యింది. ముఖ్యంగా పంచాయితీ సర్పంచ్ పదవులకు పోటీ చేసే వారంతా ఇప్పటి నుంచే గ్రామాల్లో కలవాలాలు మొదలు పెట్టారు. పలకరింపులు మొదలుపెట్టారు. బాగున్నావా అని ఆత్మీయంగా చూస్తున్నారు. పెళ్లిళ్లు, చేరంటాల సందర్భంగా గ్రామాల్లో ఇదే సందడి కనిపించింది. వారు సర్పంచ్‌కు పోటీ చేస్తున్నాననే కామెంట్స్ కూడా బాగానే వినిపించాయి. ఇకపోతే జిల్లాలో మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్నారు. జిల్లా పరిధిలో ఐదు అసెంబ్లీ నియోజక వర్గాలతో పాటు బాన్సువాడ సెగ్మెంట్‌లోని కొన్ని మండలాలున్నాయి.

# ఇండిగో విమానానికి బాంబ్ బెదిరింపు

## అత్యసవరసరంగా నాగ్‌పూర్‌లో ల్యాండింగ్

**ముంబై,,జూన్ 17సమయజ్యోతి:** విమానాల్లో సాంకేతిక సమస్యలు, బాంబు బెదిరింపులు ఇటీవలే కాలంలో ఆందోళన కలిగిస్తున్నాయి. గతవారం అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం అనంతరం ఇలాంటి ఘటనలు అనేకం వెలుగు చూస్తున్నాయి. తాజాగా కేరళ రాష్ట్రం కొచ్చి నుంచి దేశ రాజధాని ఢిల్లీ వెళ్తున్న ఓ ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు వచ్చాయి. ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన 6ఇ 2706 విమానం మస్కట్ నుంచి కొచ్చి మీదుగా ఢిల్లీ వెళ్తోంది. అయితే, విమానంలో బాంబు ఉందంటూ బెదిరింపు కాల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన పైలట్ వెంటనే విమానాన్ని నాగ్‌పూర్‌ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. అక్కడ ప్రయాణీకులందరినీ కిందకు దింపి.. తనిఖీలు నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదని నాగ్‌పూర్ డీసీపీ లోహిత్ మతాని తెలిపారు.

# అహ్మదబాద్-లండన్ విమానంలో సాంకేతికి సమస్యలు

## అత్యసవరంగా అండన్ విమానం నిలిపివేత

**న్యూఢిల్లీ,జూన్ 17సమయజ్యోతి:** దేశీయ విమానయాన సంస్థ ఎయిరిండియాలో వరుస ఘటనలు భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఈ సంస్థకు చెందిన బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానం ఇటీవల లండన్ వెళ్తుండగా అహ్మదాబాద్‌లో కుప్పకూలిన ఘటన మరవకముందే.. మరిన్ని విమానాల్లో సాంకేతిక లోపాలు బయటపడటం కలవరపెడుతోంది. తాజాగా అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లాల్సిన మరో విమానంలోనూ సాంకేతిక సమస్య ఎదురైంది. టేకాఫ్‌కు ముందే సమస్యను గుర్తించడంతో ఈ సర్వీసును రద్దు చేశారు.ఎయిరిండియా ఏఐ-159 బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం మంగళవారం మధ్యాహ్నం 1.10 గంటలకు అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరాల్సి ఉంది. ఈ క్రమంలోనే విమానంలో తనిఖీలు చేస్తుండగా.. సాంకేతిక సమస్యను గుర్తించారు. దీంతో టేకాఫ్ నిలిపివేసి సర్వీసును రద్దు చేశారు. గత వారం నాటి విమాన ప్రమాదం తర్వాత లండన్‌కు వెళ్తున్న తొలి షెడ్యూల్ విమానం ఇదే కావడం గమనార్హం.జూన్ 12న అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి లండన్ బయల్దేరిన ఏఐ 171 బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం క్షణాల వ్యవధిలోనే కుప్పకూలి దగ్గమైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో విమానంలోని 241 మంది ప్రాణాలు కోల్పోగా.. ఒకేఒక్క ప్రయాణికుడు మృత్యుంజయుడిగా బయటపడ్డారు. ఇక విమానం నివాస సముదాయంపై పడటంతో మరో 33 మంది మృతి చెందారు. ఈ ఘటన తర్వాత ఎఎ171 ÷÷-లట్ నంబర్‌ను ఎయిరిండియా పక్కనబెట్టింది. దాని స్థానంలో ఏఐ 159 నంబరును వినియోగించింది. ఇప్పుడదే సిరీస్ విమానంలో సాంకేతిక సమస్య ఎదురైంది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక విషయాలు

## షర్మిల ఫోన్‌ను ట్యాప్ చేసిన గత ప్రభుత్వం

## చెల్లి సమాచారాన్ని అన్నకు చేరవేసినట్లు అనుమానాలు

హైదరాబాద్,జూన్ 17సమయజ్యోతి:



తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక విషయాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. అనేక మంది ప్రజాప్రతినిధులు, ప్రముఖుల ఫోన్లు ట్యాప్‌కు గురైనట్లు ఇప్పటికే సిట్ గుర్తించింది. తాజాగా ఆ జాబితాలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల (ంఖఅఅ అరతి÷బి జా ÷ూరజీసపత్గి÷జీ) కూడా ఉన్నట్లు తేలింది. జగన్ చె÷-లలెలు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఫోన్లు ట్యాప్ అయినట్లు బయటపడింది. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో అత్యంత గోప్యంగా షర్మిల మొబైల్స్ ట్యాప్ అయినట్లు తేలింది. షర్మిల కోసం కోడ్ భాష ఉపయోగించినట్లు సమాచారం. షర్మిల వాయిస్ రికార్డులు అయ్యాయని, ఎవరెవరితో మాట్లాడుతుంది అనే సమాచారాన్ని ఎప్పటికప్పుడు అన్నకు (వైఎస్ జగన్) చేరినట్లు తెలుస్తోంది. షర్మిల ఎవరెవరితో మాట్లాడే వారో ప్రతీ ఒక్కరిపై నిఘా పెట్టినట్లు సమాచారం. షర్మిల దగ్గరి మనుషులను పిలిపించి ఓ సీనియర్ పోలీస్ అధికారి వార్నింగ్ ఇచ్చినట్లు గుర్తించారు. తన ఫోన్లు ట్యాప్ అవుతున్నట్లు అప్పట్లోనే షర్మిల గుర్తించారు. ఈ క్రమంలో తన ఫోన్లు ట్యాప్ విషయంలో షర్మిల వద్ద కీలక సమాచారం ఉన్నట్లు తెలుస్తోంది. బుధవారం వైజాగ్ ఎయిర్‌పోర్టులో ఫోన్ ట్యాపింగ్‌పై వైఎస్ షర్మిల స్పందిచనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ కేసులో సాక్షిగా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్టేట్‌మెంట్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు రికార్డు చేశారు. అలాగే జడ్పీ చైర్‌పర్సన్ సరిత కూడా తన ఫోన్ ట్యాప్ అయ్యినట్లు తెలపడంతో ఆమె వాంగ్మూలాన్ని కూడా రికార్డు చేశారు. తాజాగా ఏపీసీసీ చీఫ్ షర్మిల ఫోన్ ట్యాప్ అయినట్లు గుర్తించిన పోలీసులు.. ఆమెకు నోటీసులు పంపించే అవకాశం ఉంది. షర్మిలను కూడా సాక్షిగా పరిగణిస్తూ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో షర్మిల తెలంగాణలో ఉన్న సమయంలో ఆమె ఫోన్ ట్యాప్ జరగడం.. ఆమె కదలికలను అప్పటి ప్రభుత్వం ముందస్తుగానే తెలుసుకుని అరెస్ట్ చేయడం, అడ్డుకోవడం, హౌజ్ అరెస్ట్‌లు చేసిన సందర్భాలు ఉన్నాయి. అంతే కాకుండా షర్మిల ఏయే రాజకీయ నాయకుడితో మాట్లాడుతుందన్న విషయాలతో పాటు వ్యక్తిగత కాల్స్‌ను ట్యాప్ చేసి జగన్‌కు సమాచారం అందించారనే అభియోగాలు ఉన్నాయి. ఈ క్రమంలో షర్మిల స్టేట్‌మెంట్‌ను రికార్డు చేస్తే ఈ కేసులో మరికొన్ని కీలకమైన అంశాలు బయటపడే అవకాశం ఉంది. అయితే షర్మిలను జూబ్లీహిల్స్ పోలీసులు సాక్షిగా పెట్టి స్టేట్‌మెంట్ రికార్డు చేస్తారా అనేది తెలియాల్సి ఉంది.

# మూడెకరాల రైతులకు తొలుత రైతుభరోసా

## 1,551.89 కోట్ల రూపాయలను విడుదల చేశాం: తుమ్మల

ఖమ్మం,జూన్ 17సమయజ్యోతి:

తెలంగాణ రాష్ట్రంలో మూడు ఎకరాల వరకు భూమి ఉన్న అన్నదాతలకు రైతు భరోసా నిధులను ప్రభుత్వం జమ చేసింది. మంగళవారం 1,551.89 కోట్ల రూపాయలను విడుదల అయ్యాయి. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ రోజు 3 ఎకరాల వరకు భూమిని కలిగి ఉన్న రైతులందరి ఖాతాలలోకి ఎకరానికి 6 వేల చొప్పున రైతు భరోసా నిధుల జమ చేయడం జరిగిందని వెల్లడించారు. అయితే, అందుకోసం 1551.89 కోట్ల రూపాయలను విడుదల చేశామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 10.45 లక్షల మంది రైతులకు సంబంధించిన 25.86 లక్షల ఎకరాలకు రైతు భరోసా నిధులు జమ చేశాం అన్నారు. ఎకరాలతో సంబంధం లేకుండా మిగిలిన వారందరికి రైతు భరోసా నిధులు జమ చేస్తామని ప్రకటించారు.

# సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన మంత్రి వివేక్

## కుటుంబ సమేతంగా మర్యాదపూర్వకంగా భేటీ

హైదరాబాద్,జూన్ 17సమయజ్యోతి:



జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంత్రి వివేక్ వెంకటస్వామి కుటుంబ సమేతంగా మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం రేవంత్ రెడ్డి దంపతులకు వివేక్ వెంకటస్వామి దంపతులు శాలువా కప్పి సత్కరించారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి కేబినెట్‌లో అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎంతో మంత్రి వివేక్ వెంకటస్వామి ముచ్చటించారు. సీఎం కూడా కాకా వెంకటస్వామితో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణతో పలు విషయాలను సీఎం రేవంత్ రెడ్డి పంచుకున్నారు. రాష్ట్ర ఎకానమీకి అత్యంత కీలకమైన మైనింగ్ శాఖ బాధ్యతలను మంత్రి వివేక్ వెంకటస్వామికి సీఎం రేవంత్ రెడ్డి కేటాయించిన సంగతి తెలిసిందే. గనుల ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంతో పాటు కార్మికుల సంక్షేమం, ఉపాధి, శిక్షణ కార్యక్రమాల నిర్వహణ లాంటి కీలక బాధ్యతలు ఆయనకు అప్పగించారు. వివేక్‌కు ఉన్న అనుభవం, రాజకీయ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ శాఖలను కేటాయించారు.

# కులగణనపై గళమెత్తిన రాహుల్

## బిసి మంత్రిత్వ శాఖ కోరినా ఇవ్వని మోడీ: విహెచ్

హైదరాబాద్,జూన్ 17సమయజ్యోతి:

కుల గణనపై ఎవరు మాట్లాడనప్పుడే రాహుల్ గాంధీ మాట్లాడారని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు పేర్కొన్నారు. ఎవరు ఎంతో, వారికి అంత అని చెప్పారు.. ఇప్పటి వరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని మూడుసార్లు కలిసి బీసీలకి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఇవ్వమని కోరినా ఇవ్వలేదు.. జన గణనతో మాకు వచ్చే లాభం లేదు అని తేల్చి చెప్పారు. కుల గణన చేస్తే మాకు మంచిది.. రాహుల్ గాంధీ అగ్రకులంలో పుట్టినా బీసీలకు న్యాయం చేయాలని మాట్లాడారు.. మోడీ బీసీ అయినా, కుల గణన చేయడానికి ఆలోచిస్తున్నాడు అని ఎద్దేవా చేశారు. జన గణనతోనే కుల గణన చేయాలి అని వి. హనుమంతరావు డిమాండ్ చేశారు. ఇక, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖతో పాటు కుల గణన చేయాలని వీహెచ్ కోరారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ ఎంపీలు నోరు విప్పాలి.. లేదంటే, ఎంపీల ఇంటి ముందు ధర్నా చేస్తాను అని హెచ్చరించారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం కులగణన సర్వే బీసీలకు న్యాయం చేసింది.. అలాగే, కేంద్ర ప్రభుత్వం కూడా కుల గణన చేపట్టి బీసీలకు రావాల్సిన న్యాయమైన వాటాను అందజేయాలని అన్నారు.

# పశ్చిమాసియా యుద్ధ వాతావరణం

## చమురు ధరలపై తీవ్ర ప్రభావం

## మరింతగా పెరగనున్న రూపాయి మారకం

న్యూఢిల్లీ,జూన్17సమయజ్యోతి:



పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా చముఉ ధరలు పెరిగే ప్రమాదం ఉంది. అందేకాకుండా డాలర్ మారకం కూడా పెరిగే ప్రమాదం ఉంది. అలాంటి సంకేతాలు కూడా అందుతు న్నాయి. ఇరాన్ కనుక పట్టుదలకు పోతే చమురు రవాణాకు తీవ్ర ప్రమాదం ఏర్పడే అవకాశాలు మెండుగా ఉ న్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే ఆర్థిక మందగమనం, ద్రవ్యోల్బణం, రూపాయి పతనం ఇప్పుడు దేశాన్ని కుదిపే స్తున్నాయి. వీటి ప్రభావం ధరలపై పడుతోంది. తద్వారా సామాన్యుడు విలవిల్లాడు తున్నాడు. సజావుగా ఉన్నప్పుడే దిద్దుబాటు చర్యలు ఉంటాయా అన్నది అనుమానంగానే ఉండేది. ఇప్పటికే ధరలు అదుపులోకి రావడం లేదు. నిరుద్యోగం తీరడం లేదు. రూపాయి విలువను కాపాడే ప్రయత్నాలు జరగడం లేదు. నేలవిడిచి సాము చేస్తున్న చందంగా కేంద్రం చర్యలు ఉంటున్నాయి. నిజానికి చైనాను చూసి మనం ఎంతో నేర్చుకోవాల్సి ఉంది. అధిక జనాభాను ఉపయోగించుకుని వస్తూత్పత్తిని పెంచుకుని ప్రపంచ మార్కెట్ పెంచుకునే ప్రయత్నాలు చేయడం లేదు. అలాగే గత పదేళ్లుగా మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఏనాడూ రూపాయిని నిలబెట్టే ప్రయత్నాలు చేయలేదు. అందుకే డాలర్ ముందు రూపాయి తేలిపోతోంది. రోజురోజుకూ విలువ కోల్పోతూ తన రికార్డును తానే బద్దలుకొడుతోంది. ఇటీవల రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే..రూ. 87కు చేరువలో ఉంది. సమీపకాలంలో రూపాయి విలువ మరింత పతనం కావచ్చునని ఆర్థికవేత్తలు అంచనావేస్తున్నారు. చమురు ధరలు పెరిగితే ఇది మరింత పతనం కావచ్చు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఇదే సూచిస్తున్నాయి. అయినా ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ మాత్రం కొత్తంగా ఏయే పన్నులు వేయవచ్చో..వేటిని జిఎస్టీ కిందకు తీసుకుని రావవచ్చో అన్న ఆలోచనలో ఉన్నట్లుగా ఉంది. యూపిఐ పేమెంట్లపై సర్‌ఛార్జ్ విధిస్తారన్న వాదనలు బలంగా ముందుకు వచ్చాయి. కానీ తీవ్ర విమర్శలు రావడంతో..అలాంటిదేమీ లేదని సమాధానం వచ్చింది. 2014లో ఎన్నికల ప్రచారంలో నరేంద్ర మోదీ రూపాయి పతనం గురించి చేసిన వ్యాఖ్యలు అందరూ గుర్తుకు తెచ్చుకోవాల్సిన తరుణమిది. దేశ రక్షణ గురించి గానీ,రూపాయి పతనం గురించి గానీ మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికి పట్టింపు లేదని మోదీ అప్పట్లో ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఆయనతో పాటు, ఆయన ప్రధాని కావాలని కోరుకున్న ప్రముఖులంతా రూపాయి పతనం మీద చేసిన వ్యాఖ్యలు అప్పుడే మరచిపోలేం. ఎందుకంటే రూపాయి పతనం అప్పటి కన్నా వేగంగా పతనం అవుతోంది. అప్పట్లో రూపాయి గురించి గుండెలు బాదుకున్న వారంతా ఇప్పుడు ఎందుకో నోరువిప్పడం లేదు. ఇప్పుడు రూపాయి పతనం ఎంతగా పడిపోతున్నా ఎందుకనో మన మౌనముని మోడీ మాత్రం నోరు విప్పడం లేదు. మన్మోహన్ సింగ్‌ను మౌనముని అంటూ దెప్పి పొడిచిన మోడీ ఇప్పుడు తాన అతిపెద్ద మౌనమునిగా మారారు. రూపాయి విలువ దారుణంగా పడిపోవడంతో ఆర్థిక నిపుణుల్లో ఆందోళన నెలకొంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దిద్దుబాటు చర్యలేవీ ఫలితాలు ఇవ్వడం లేదు. మార్కెట్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మోదీ ప్రభుత్వానికి ఈ విషయమే పట్టని.. ఫలితంగా పతనంలో రూపాయి కొత్త రికార్డులు సృష్టించడం ప్రారంభమైంది. రూపాయి విలువ తగ్గిపోతోంది కాబట్టి మన జేబులో డబ్బు ఎక్కువగా ఖర్చు చెయ్యాల్సి వస్తోంది. అందువల్ల దిగుమతులపై సుంకాలు విధిస్తే సరిపోతుందన్న భావనలో మోదీ ప్రభుత్వం ఉంది. ఇదొక్కటే సరిపోదు. మనదేశ ఎగుమతులు పెరగాలి. మన మార్కెట్ పెరగాలి. మన వస్తువులు ప్రపంచాన్ని తాకాలి. అప్పుడే రూపాయికి బలం చేకూరుతుంది. మేకిన్ ఇండియా నినాదంగా మారడంతో వస్తూత్పత్తి పడిపోయింది. కార్మికులు పనులు లేకుండా పస్తులు ఉంటున్నారు. అందుకే గత పదేళ్ళలో డాలర్‌తో రూపాయి మారకపు విలువ 25 శాతం పతనమైంది. అప్పట్లో నెలకు రూ. 10వేలు సంపాదించేవారు సంసరాన్ని ఈడ్చుకుని వచ్చేవారు. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో నెలకు దాదాపు రూ. 50వేల దాకా సంపాదించాలి. ఆ స్థాయిలో సామాన్యుల వేతనాలు పెరుగుతున్నాయా అంటే లేదు. కాబట్టి రూపాయి పతనం వల్ల నష్టపోతున్నది పేదలు, మధ్య తరగతివారు, సామాన్యులే. పదేళ్ల కిందట ఒక డాలర్ కోసం మనం 63 రూపాయలు చెల్లించాల్సి వచ్చేది. మరి ఇప్పుడు 87 రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. దీంతో విదేశాలకు వెళ్లే విద్యార్థులకు చదువులు భారంగా మారాయి. ఇదివరకు కూరగాయలు కొంటే 100 రూపాయలకి సంచినిండేది, ఇప్పుడు 500 రూపాయలు పెట్టినా నిండట్లేదు. ఒక్క కూరగాయలే కాదు, ఇంట్లో వాడే ప్రతీ నిత్యావసరం ధరా పెరుగుతూనే ఉంటుంది. పప్పుల ధరలు 250కి కిలోగా ఉన్నాయి. యుద్ధభయాలు ఇలాగే ఉంటే ధరలు మరింత పెరగడం ఖాయం. రూపాయి పతనం వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు బాగా పెరుగుతాయి. మనం విదేశాల నుంచి చమురును ఎక్కువగా కొంటున్నాం, భారీగా చెల్లింపులు జరుపుతున్నాం కనుక విలువ ప్రభావం ఇక్కడ అధికంగా ఉంటుంది. చమురు రవాణా ఆగిపోతే మన అసవరాలకు ఎక్కువ మొత్తం వెచ్చించాల్సి రావచ్చు. కోడిగుడ్డు ఒక రూపాయి నుంచి గత సంవత్సరం 5 రూపాయలు అయ్యింది. ఈ సంవత్సరం 7 రూపాయలు అయ్యింది. కోళ్ల దాణా, కరెంటు ఖర్చు, కూలీ వేతనాలు, నిర్వహణ ఖర్చులు, రవాణా ఖర్చులు ఇలా అన్నీ పెరుగుతూ గుడ్డు ధర కూడా పెరిగింది. ఇలా ఒకదానిపై ఒకటి ఆధారపడుతూ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా బలమైన అడుగులు పడకపోతే, భారతదేశం మరింతగా నష్టపోవడం ఖాయం. మన ఎగుమతులను, ఉత్పాదకత సామర్థ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉన్నది. ఉద్యోగ కల్పన, మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలి. దీంతో ఉత్పత్తి పెరిగి ఎగుమతుల ద్వారా విదేశీ మారక ద్రవ్యం ఆర్జించి రూపాయి స్థిరీకరణ చేయవచ్చు. దేశీయంగా ఎలక్ట్రానిక్స్ సంస్థలు నెలకొల్పి, ఉన్నవాటి సామర్థ్యాన్ని ఉత్పత్తిని పెంచి దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించాలి. దిగుమతుల్లో ప్రముఖపాత్ర వహిస్తున్న ఇంధన అవసరాల కోసం దేశీయ సంస్థల్ని పురికొల్పి, ఎక్కువ ఉత్పత్తిని సాధించాలి. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ఉత్పాదకతను పెంచడం ద్వారా స్వయం సమృద్ధి సాధించాలి. మనకు సహజవనరులతో పాటు, మానవ వనరులు విశేషంగా ఉన్నాయి. వాటిని ఉపయోగించుకుని వస్తూత్పత్తిని పెంచుకుంటే తప్ప ముందుకు సాగలేం.

# ఆపరేషన్ సిందూర్‌తో టెర్రరిస్టుల అణచివేత

## పాక్ దుర్నీతిని ప్రపంచదేశాలకు వివరించాం

## భారత్ చర్యలను సమర్థించిన పలు దేశాలు

## దౌత్యపరమైన విజయం సాధించామన్న ఎంపి మాధుర్

అంబేద్కర్ కోనసీమ,జూన్ 17సమయజ్యోతి:

ఆపరేషన్ సిందూర్‌ని ప్రారంభించి టెర్రరిజం అణచివేతకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ నేతృత్వంలో గయానా, పనామా, కొలంబియా, బ్రెజిల్, యునైటెడ్ దేశాలను సందర్శించారు. ఈ బృందంలో ఎంపీ హరీష్ బాలయోగి కూడా ఉన్నారు. ఢిల్లీకి తిరిగి వచ్చిన తర్వాత మీడియాతో ఆయన మాట్లాడారు. ఐదు దేశాలతో దౌత్యపరమైన చర్చలు జరిపినట్లు వెల్లడించారు. టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఐదు దేశాలు ఇండియాకు మద్దతిచ్చాయని అన్నారు. ఈ సందర్భంగా ఆ దేశాల ప్రతినిధులకు ఎంపీ గంటి హరీష్ మాధుర్ ధన్యవాదాలు తెలిపారు. మే 24వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు వివిధ దేశాల్లో తాము పర్యటించామని ఎంపీ గంటి హరీష్ మాధుర్ వెల్లడించారు. యునైటెడ్ నేషన్స్ పర్యటన అనంతరం ఇండియాకు చేరుకున్నామని తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడదామని ఆయా దేశాలకు తాము వివరించామని అన్నారు. పాకిస్థాన్ మిలటరీ బేస్ క్యాంప్‌నకు ఇబ్బంది లేకుండా టెర్రరిస్టులను మాత్రమే లక్ష్యంగా చేసుకుని భారత బలగాలు దాడులు చేశాయని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నేతలతో కలిసి ఈ పర్యటన చేశామని చెప్పారు. న్యూయార్క్ 9/11 టెర్రరిస్ట్ దాడులను జ్ఞాపకం చేసుకుని, టెర్రరిజాన్ని అంతం చేయాలనే విషయాన్ని ఆయా దేశాల ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశామని అన్నారు. తాము పర్యటించిన ప్రతి దేశంలో భారతదేశానికి మద్దతు లభించిందని ఎంపీ గంటి హరీష్ మాధుర్ గుర్తుచేశారు. ÷్రరరిజానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఐదు దేశాల ప్రతినిధులకు భారతదేశం అండగా ఉంటుందని చెప్పామని ఎంపీ గంటి హరీష్ మాధుర్ అన్నారు. యుద్ధం పరిష్కారం కాదు కానీ టెర్రరిజం అంతం చేసే ప్రణాళికలకు అందరూ సహకరిస్తున్నారని అన్నారు. భార్య బిడ్డల ముందు పహల్గామ్‌లో భారత పర్యాటకులను పాకిస్థాన్ ఉగ్రవాదులు చంపడం నీచమైన చర్య అని... దీనినే ప్రపంచ దేశాలకు తెలియజేశామని చెప్పారు. ఇండియాతో కలసి రావటానికి ప్రపంచ దేశాలు మొగ్గు చూపాయని పేర్కొన్నారు. పాకిస్థాన్ చేస్తున్న తప్పుడు ఆరోపణలను సమర్థవంతంగా తిప్పికొట్టామని ఎంపీ గంటి హరీష్ మాధుర్ అన్నారు. పాకిస్థాన్ చేస్తున్న కుట్రలను ప్రపంచ దేశాలకు తెలియజేశామని... వాస్తవాలను అందరూ గ్రహించారని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో సామాన్యులకు, పౌరులకు ఎలాంటి హాని జరగలేదని గుర్తుచేశారు. పక్క ప్రణాళికతో ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేశామని పేర్కొన్నారు. ఈ అవకాశం తనకు కల్పించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి కృతజ్ఞతలు తెలిపారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన విషయాలు

## ఒకేరోజు 600మంది ఫోన్ల ట్యాప్

## నక్సల్స్ సానుభూతిపరుల పేరుతో ట్యాప్

## జాబితాలో రేవంత్, ఈటెల, అరవింద్ , రఘునందన్ రావు

## మరోమారు విచారణకు హాజరైన ప్రభాకర్ రావు

హైదరాబాద్,జూన్ 17సమయజ్యోతి:

ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్న తరుణంలో ప్రధాన నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచి(ఎస్ఐబీ) మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు మరోసారి సిట్ విచారణకు హాజరయ్యారు. నాలుగో సారి సిట్ ముందు హాజరైన ఆయనను మరింత లోతుగా విచారించేందుకు సిట్ ప్రణాళికలు రూపొందించింది. ఇప్పటికే 600 మంది ఫోన్ ట్యాపింగ్ బాధితుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. ఫోన్ ట్యాపింగ్‌తో వారు ఇబ్బందులకు గురైన తీరును వివరించి.. దానిపై ప్రభాకర్‌రావు ఏం చెబుతారనే విషయాన్ని నమోదు చేయనున్నట్లు సమాచారం. ఈ క్రమంలో తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. సాధారణ ఎన్నికల సమయంలో నవంబర్ 15న పెద్ద ఎత్తున ట్యాపింగ్ జరిగినట్లు పోలీసులు గుర్తించారు. నవంబర్ 15న 600 మంది ఫోన్లను ప్రభాకర్ రావు టీమ్ ట్యాప్ చేసినట్లు గుర్తించారు. సాధారణ ఎన్నికల సమయంలో ప్రణీత అండ్ టీమ్ పెద్ద ఎత్తున ట్యాపింగ్‌కు పాల్పడినట్లు బయటపడింది. ఒకే రోజు 600 ఫోన్‌లను ప్రభాకర్ రావు ట్యాప్ చేశారు. మావోయిస్టుల పేరు చెప్పి ట్యాపింగ్‌కు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. మావోయిస్టులకు సహకారం అందిస్తున్నారని మావోయిస్టుల సానుభూతిపరుల పేర్లతో ట్యాపింగ్ చేసినట్లు గుర్తించారు. రివ్యూ కమిటీకి మావోయిస్టుల పేర్ల మీద నెంబర్లను ప్రభాకర్ రావు ఇచ్చినట్లు తేలింది. సాధారణ ఎన్నికల్లో మావోయిస్టులు యాక్టివ్ అయ్యారని కమిటీకి ప్రభాకర్ రావు చెప్పినట్లు సమాచారం. మావోయిస్టుల పేరుతో అధికార, ప్రతిపక్ష, వ్యాపార రంగానికి చెందిన వారితో పాటు జర్నలిస్టుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారు. ప్రతిపక్ష కాంగ్రెస్ ముఖ్య నాయకులతో పాటు కీలక నాయకుల ఫోన్లు కూడా ట్యాప్ అయ్యాయి. రేవంత్ రెడ్డి, ఈటెల రాజేందర్, అరవింద్ , రఘునందన్ రావు ఫోన్‌లను ట్యాప్ చేసినట్లు గుర్తించారు. అప్పటి బీఆర్ఎస్ అధికారపక్ష నాయకులు, ఎమ్మెల్యేల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేశారు. ట్యాపింగ్ కోసం ప్రభాకర్ రావు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. శ్రవణ్ రావు ద్వారా సమాచారం తెప్పించుకొని ప్రణీతరావుకు ప్రభాకర్ రావు ఇచ్చేవారని తేలింది. ట్యాపింగ్ ద్వారా వచ్చిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు భుజంగరావుకు ప్రణీత్ ఇచ్చారని... భుజంగరావు నేరుగా బీఆర్ఎస్ నేతలకు ఫోన్ చేసి స్థితిగతులను ఎప్పటికప్పుడు వివరించినట్లు పోలీసులు గుర్తించారు. ప్రతిపక్ష నాయకుల వైపు ఎవరైనా వెళ్తుంటే వెంటనే అధికారపక్ష నేతలకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు భుజంగరావు. ప్రతిపక్ష పార్టీలకు ఆర్థిక సాయం చేస్తున్న వారిపై నిఘా పెట్టి పోలీసులతో దాడులు చేయించారు. వ్యాపారవేత్తలపై దాడుల కోసం టాస్క్ ఫోర్స్ ఓఎస్డీ రాధా కిషన్ రావును ప్రభాకర్ రావు ఉపయోగించుకున్నట్లు సమాచారం. డబ్బులు ఎవరైనా తీసుకువెళ్తుంటే వెంటనే ట్యాప్ చేసి మరీ అధికారులు పట్టుకున్నట్లు పోలీసులు గుర్తించారు.

# సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో ఇందిరా మహిళా శక్తి

# చీరల ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించిన విప్

## -చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కలెక్టర్

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కార్మికులకు ఇందిరా మహిళా శక్తి చీరల ఉత్పత్తితో చేతినిండా పని కల్పిస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. సిరిసిల్లలోని గణేష్ నగర్ లో మామిడాల నారాయణ, కొండ సుభాష్ కు మరమగ్గాల యూనిట్లను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చేనేత జౌళి, దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అధికారులతో కలిసి మంగళవారం చీరల ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించి, వారు కార్మికులతో మాట్లాడారు. వేముల శ్రీనివాస్, మెరుగు శ్రీనివాస్ తదితర కార్మికులతో ప్రిన్సిపల్ సెక్రటరీ, కలెక్టర్ మాట్లాడారు. ప్రతి రోజు ఎన్ని మీటర్ల చీర ఉత్పత్తి చేస్తున్నారని? వారానికి ఎంత ఆదాయం వస్తుందని? అడిగి తెలుసుకున్నారు. చీరల ఉత్పత్తిలో ఏమైనా ఇబ్బంది ఎదురవుతున్నాయని ఆరా తీశారు. తమకు ప్రతివారం రూపాయలు 4000 నుంచి 5000 వరకు ఆదాయం వస్తుందని కార్మికులు వారి దృష్టికి తీసుకెళ్లారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి, కార్మికులను ఆదుకునేందుకు చేతినిండా పని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని వివరించారు. ఇందులో భాగంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఇందిరా మహిళ శక్తి కింద చీరల ఉత్పత్తి ఆర్డర్లు అందించామని తెలిపారు.కార్మికులు, ఆసాములు కోరిన విధంగా ధర నిర్ణయించామని వెల్లడించారు. ఇందిరా మహిళా శక్తి చీరలతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని కార్మికులు, ఆసాములకు దాదాపు 8 నెలల పాటు ఉపాధి లభిస్తుందని తెలిపారు. గతంలోని బతుకమ్మ చీరల బకాయిలు దాదాపు 280 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించిందని గుర్తు చేశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధిలో భాగంగా దశాబ్దాల కల నెరవేరుస్తూ వేములవాడలో 50 కోట్లతో యార్న్ బ్యాంకు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు అవసరమైన యార్న్ అంతా అక్కడ అందుబాటులో పెడుతున్నామని తెలిపారు. ఇతర ప్రభుత్వ శాఖ ఆర్డర్లు సిరిసిల్లకు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో కార్మికులు ఉపాధి లేక ఇబ్బంది పడేవారు అని ఇప్పుడు చేతినిండా పని ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఆర్డర్లను ఆసాములు, కార్మికులు సద్వినియోగం చేసుకొని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. సెస్ పరిధిలోని బ్యాక్ బిల్లింగ్ సమస్య కోర్టు పరిధిలో ఉందని దానిపై త్వరలో రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఇతర మంత్రులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా చేనేత జౌళి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్య మాట్లాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు అవసరమైన ఆర్డర్లన్నీ రాష్ట్ర ప్రభుత్వం తరపున అందజేస్తున్నామని తెలిపారు. కార్మికులకు ప్రతివారం రూపాయలు 4000 నుంచి 5000 వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇందిరా మహిళల శక్తి చీరల ఆర్డర్ పొందిన వారు మొదటి చీర ఉత్పత్తిని త్వరగా పూర్తి చేసి అందజేయాలని సూచించారు. రెండో చీర ఆర్డర్ కు సిద్ధం కావాలని పేర్కొన్నారు రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకొని మరింత అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రెడ్డి, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ ఏడీ రాఘవరావు పాల్గొన్నారు.



# ఆయిల్ పామ్ సాగుకు అన్ని విధాలుగా ప్రోత్సాహం:కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి

## ఆయిల్ పామ్ నర్సరీని సందర్శించిన అధికారులు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి**

**నిజామాబాద్ బ్యూరో**

గణనీయమైన దిగుబడితో అధిక లాభాలను అందించే ఆయిల్ పామ్ పంట సాగు కోసం ఆదర్శ రైతులు ముందుకు రావాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్ నేతృత్వంలో ఉద్యానవన శాఖ అధికారులు మంగళవారం ఆర్మూర్ మండలం చేపూర్ లోని ఆయిల్ పామ్ నర్సరీని సందర్శించారు. పంపిణీకి సిద్ధంగా ఉన్న లక్షన్నర ఆయిల్ పామ్ మొక్కలను పరిశీలించి, క్షేత్రస్థాయి పరిస్థితిని కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా రైతులకు ఆయిల్ పామ్ పంట సాగు చేపట్టాల్సిన ఆవశ్యకత గురించి నొక్కి చెప్పారు. ఈ పంట సాగు వల్ల కలిగే లాభాల గురించి ప్రతి రైతు తెలుసుకోవాలని సూచించారు. వంట నూనె తయారీతో పాటు ఇతర అనేక ఉత్పత్తుల్లో వినియోగించే ఆయిల్ పామ్ పంటకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. దేశవ్యాప్తంగా స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా 75 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు జరగాల్సి ఉండగా, ప్రస్తుతం కేవలం పది శాతం విస్తీర్ణంలోపే ఈ పంట సాగు చేస్తున్నారని అన్నారు. దీనివల్ల ఇతర దేశాల నుండి వంట నూనె నిల్వలను పెద్ద ఎత్తున దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొని ఉందన్నారు. స్థానికంగానే ఆయిల్ పామ్ పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తే, రైతులు అధిక లాభాలు ఆర్జించడంతో పాటు దేశానికి కూడా మేలు చేసిన వారవుతారని అన్నారు. ఆయిల్ పామ్ పంట సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీలతో కూడిన ప్రోత్సాహకాలను అందిస్తోందని వివరించారు. ఈ పంట సాగు చేస్తున్న రైతులకు ఇన్ పుట్ సబ్సిడీని రైతు ఖాతాలో జమ చేస్తోందని తెలిపారు. ఆయిల్ పామ్ మొక్కలకు అయ్యే వ్యయంలో కూడా అధిక మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తూ సబ్సిడీ రూపంలో కంపెనీలకు చెల్లిస్తుందని అన్నారు. ఆయిల్ పామ్ బోర్డు ఉన్నందున పంట అమ్మకం, ధర విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. మొక్కలు అందించిన కంపెనీలే, బోర్డు ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు పంటను కొనుగోలు చేస్తాయని తెలిపారు. ఎకరం విస్తీర్ణంలో సుమారు పది టన్నుల వరకు దిగుబడి వస్తుందని, అంతర పంట వేసుకొని అదనపు లాభాలను సైతం పొందవచ్చని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. ప్రస్తుతం మార్కెట్లో ఈ పంటకు ఉన్న డిమాండ్ ను బట్టి చూస్తే ఎకరానికి కనీసం రెండు లక్షల రూపాయలకు పైగా ఆదాయం ఆర్జించే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చే రైతులకు జిల్లా యంత్రాంగం తరపున అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తామని అన్నారు. ప్రభుత్వ తోడ్పాటును జిల్లా రైతాంగం అందిపుచ్చుకుని, ఆయిల్ పామ్ సాగు ద్వారా ఇతోధికంగా లాభాలు సాధించాలని కలెక్టర్ హితవు పలికారు.



# బాల్కొండలో కమ్యూనిటీ కాంటాక్ట్

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండల కేంద్రంలో ఎసిపి వెంకటేశ్వర్ రెడ్డి, సిఐ తోపాటు, ఎస్సై బి.నరేష్ ఆధ్వర్యంలో నడిమిల్లి, అత్తర్ గల్లిలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసులు ఇంటింటికి వెళ్లి, వాహనాలను తనిఖీ చేశారు. 45 ద్విచక్ర వాహనాలు మూడు ఆటోలు తదితర వాహనాలను తనిఖీ చేశారు. పత్రాలు సరిగా లేని వాహనాలను ఠాణాకు తరలించారు. తమ వాహనాలకు ధృవీకరణ పత్రాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని, ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, హెల్మెట్ ధరించని యువకులు సుమారు 27 మంది రోడ్డు ప్రమాదం గురై మృతి చెందారని వెల్లడించారు. సైబర్ నేరగాళ్లు మోసపూరితంగా ఫోన్ కాల్ చేసి, రోడ్డు ప్రమాదానికి గురైనారని తెలిపి డబ్బులు కాజేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచితుల సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ సత్యనారాయణ, ఎస్సైలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కంటి వైద్య శిబిరం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండలం కిసాన్ నగర్ లోని లయన్స్ భవనంలో మంగళవారం బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నిజామాబాద్ లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ ప్రవళిక 40 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. మూతి బిందు ఉన్న వారిని గుర్తించి శస్త్ర చికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ ఆసుపత్రికి తరలించారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చాకులింగం, జిల్లా బాధ్యులు జ్ఞాన సాగర్ రెడ్డి, దినేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



# గోదావరి మిగులు జలాలతో బనకచర్ల

## సముద్రంలో కలిసే నీటినే వినియోగించేలా ప్లాన్

## ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదు: రామానాయుడు

**అమరావతి,జూన్ 17సమయజ్యోతి:**

గోదావరి వరదల వల్ల ఎపికే ఎక్కువ నష్టం అని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పర్యావరణ అనుమతుల కోసమే కేంద్రానికి లేఖ రాశాం అని అన్నారు. ఈ సందర్భంగా నిమ్మల మీడియాతో మాట్లాడుతూ.. వరదల వల్ల నష్టపోతున్న ఎపికి.. నీళ్లు ఉపయోగించుకునే హక్కుఉందని చెప్పారు. గోదావరి నీళ్లు నిరుపయోగంగా సముద్రంలో కలుస్తున్నాయని, ఎగువ నీటి అవసరాలు తీరిన తర్వాతే బనకచర్లకు నీళ్లు వృథాగా పోతున్నాయని ఆ నీళ్లనే బనకచర్లకు వాడుకుంటాం అని తెలియజేశారు. రాజకీయ లబ్ధి కోసమే బనకచర్లపై వైసిపి విమర్శలు చేస్తుందని మండిపడ్డారు. ప్రాజెక్టుతో ఎగువ రాష్ట్రాలకు నష్టం లేదని అన్నారు. బనకచర్లపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని, ప్రాజెక్టుపై అనుమానాలు అవసరం లేదు అని నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు వల్ల ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఈ ప్రాజెక్టుపై ఆయన సచివాలయంలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఏటా గోదావరి నుంచి 3 వేల టీఎంసీలు వృథాగా సముద్రంలోకి పోతున్నాయని ఆయన వివరించారు. 'ప్రపంచంలోనే ఒక నదిలో ఒకే సమయంలో 50 లక్షల క్యూసెక్కులు ప్రవహించే నది గోదావరి. పోలవరం వద్ద లభ్యమయ్యే గోదావరి వరద జలాలను మాత్రమే ఉపయోగించుకుంటాం. వృథాగా సముద్రంలోకి పోయే నీటిని మాత్రమే బనకచర్లకు తరలిస్తాం. ఎక్కడా నికర జలాలను వాడట్లేదని స్పష్టంగా చెబుతున్నాం.

ఎగువ రాష్ట్రాలకు కేటాయించిన నీటిని వాడుకునే పరిస్థితి లేదని ఆయన వెల్లడించారు. బనకచర్ల ప్రాజెక్టుపై వాస్తవాలు ప్రజలకు తెలియాలని, దీనిపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, గత 50 ఏళ్లుగా గోదావరి నీరు వృథాగా 3000 టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తోందని, ఇందులో 200 టీఎంసీల నీరు ఉపయోగించి బనకచర్లకు తరలించాలనే ఈ ప్రాజెక్ట్ నిర్మాణ ఉద్దేశమని ఏపీ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మూడు సెగ్మెంట్‌లుగా బనకచర్ల నిర్మాణం జరుగుతుందని, పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు.. ప్రకాశం బ్యారేజీ నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్ వరకు.. సెగ్మెంట్ 2: బొల్లాపల్లి నుంచి బనకచర్ల వరకు.. సెగ్మెంట్ 3.. ఇలా మూడు సెగ్మెంట్‌లలో నిర్మాణం జరుగుతుందని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. బనకచర్లపై వస్తున్న ఆరోపణలు కేవలం రాజకీయాల కోసమేనని, సాంకేతిక అంశాల కన్నా రాజకీయంపై దృష్టితోనే ఆరోపణలు చేస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. తెలంగాణలో అంతర్గత రాజకీయలు కోసం బనకచర్లపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి అనుమతి లేకుండా ఏపీ ప్రభుత్వం ముందుకు వెళుతోందని అసత్యాలు చెబుతున్నారని మండిపడ్డారు. అన్ని నియమ నిబంధనల ప్రకారమే అనుమతి తీసుకుని నిర్మాణం జరుగుతుందన్నారు. సీడబ్ల్యూసీకి ఇప్పటికే ప్రాథమిక నివేదిక ఇచ్చామని చెప్పారు. ఆమోదం లేకుండా డీపీఆర్ ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారని, ప్రాథమిక నివేదిక ఆమోదం తెలిపాక డీపీఆర్ ఇస్తామని మంత్రి తెలిపారు. పోలవరం, బనకచర్ల అనుమతులు నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయని మరోసారి స్పష్టం చేశారు. ఏపీ జలదోపిడీ అని విమర్శలు



చేస్తున్నారని, వరద జలాలు ఉపయోగించుకోవడం తమ హక్కు అని, దిగువ రాష్ట్రం అయిన ఆంధ్రప్రదేశ్ ఎగువ రాష్ట్రాల ప్రయోజనాలు... నీటి అవసరాలు తీరాక మాత్రమే వరద జలాలు ఉపయోగిస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఏ రాష్ట్రానికి ఎలాంటి నష్టం లేదని, ప్రతి ఏడాది 3వేల టీఎంసీల నీరు సముద్రంలోకి పోతోందన్నారు. ఒక ఏడాది 7 వేల టీఎంసీల నీరు సముద్రంలోకి వృథాగా పోయిందన్నారు. ఇంకా వర్షాకాలం పూర్తిగా రాకుండానే సముద్రంలోకి నీరు వృథాగా పోతోందని అన్నారు. కేసీఆర్ చేపట్టిన ప్రాజెక్టులకు సరైన అనుమతి తీసుకోలేదని ఆరోపించారు. పూర్తయిన ప్రాజెక్టులకే అనుమతి లేదని, ఇంకా ప్రారంభ దశలో ఉన్న ప్రాజెక్టుల అనుమతిపై మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రాజెక్టును ఆపాలన్న దురుద్దేశం తమకు లేదని... సీఎం చంద్రబాబుకు అసలే లేదని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు. సీతారాం సాగర్ లిఫ్ట్‌కు కూడా మొన్ననే అనుమతి వచ్చిందని, కానీ 75 శాతం పనులు పూర్తయ్యాయని అన్నారు.

దేవాదుల ఎత్తి పోతల పథకంతో పాటు చాలా ప్రాజెక్టులకు చంద్రబాబు సహకరించారని, బీమా ఎత్తిపోతల పథకానికి కూడా సహకారం అందించారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఎస్సారెస్పీతో పాటు అనేక ప్రాజెక్టులకు చంద్రబాబు సహకరించారన్నారు. ఈ విషయాన్ని తెలంగాణా ప్రజలు గుర్తు పెట్టుకోవాలన్నారు. దిగువ రాష్ట్రాలకు ఉన్న హక్కుల ప్రకారం చంద్రబాబు కొన్ని ప్రాజెక్టుల విషయంలో అభిప్రాయం చెప్పారు తప్ప అడ్డుకోవాలని కాదని అన్నారు. అపెక్స్‌లో ఇరు రాష్ట్రాల సీఎంల మాటలు మినిట్స్ రూపంలో ఉన్నాయన్నారు. రెండు రాష్ట్రాలు ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో ఉండాలని చంద్రబాబు చెప్పారని మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు.

# సర్క్యులర్ ఎకానమీ పార్కుల ఏర్పాటు

## సమీక్షించిన సిఎం చంద్రబాబు

**అమరావతి,జూన్ 17సమయజ్యోతి:**



సర్క్యులర్ ఎకానమీ పార్కుల ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం యోచన చేస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం సర్క్యులర్ ఎకానమీపై రాష్ట్ర సచివాలయంలో అధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సర్క్యులర్ ఎకానమీ పార్కులపై సీఎం చంద్రబాబు పలు సూచనలు చేశారు. వ్యర్థాల నుంచి సంపద సృష్టి, వనరుల పునర్వినియోగంపై సమీక్షలో చర్చించారు. అయితే 'మెటీరియల్ రీసైక్లింగ్‌కి అసోసియేషన్ ఆఫ్ ఇండియా' ప్రతిపాదనలు సిద్ధం చేసింది. సర్క్యులర్ ఎకానమీ కింద కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 11 రంగాలపై ఏపీ ప్రభుత్వం దృష్టి పెట్టింది. మున్సిపల్, వాహనాలు, లిథియం బ్యాటరీలు, జిప్సం, టైర్లు, రబ్బర్, ఎలక్ట్రానిక్, వ్యవసాయం, పారిశ్రామిక, ఆక్వా వ్యర్థాల నుంచి సర్క్యులర్ ఎకానమీ సృష్టించేలా కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. వీటికి అదనంగా గనులు, చేనేత, పశుసంవర్ధక శాఖలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. నగర పాలక సంస్థలు, పంచాయతీల్లో జీరో వేస్ట్ లక్ష్య సాధనకు ఏపీ ప్రభుత్వం కృషి చేస్తోంది.

బెట్టింగ్ అప్పులతో చనిపోయిన వ్యక్తికి పరామర్శలా?

# కుప్పంలో ఓ మహిళ పట్ల అమానుషం

## -బాకీ వసూలు కోసం చెట్టుకు కట్టేసి హింస-ఘటనపై సిఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం

## వెంటనే చర్యలకు ఎస్పీకి ఆదేశం

**అమరావతి,జూన్ 17సమయజ్యోతి:**

అప్పు తీర్చలేదని మహిళను చెట్టుకు కట్టేసిన ఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. స్వయంగా సిఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలోనే ఈ ఘటన జరిగింది. దీనిపై వచ్చిన కథనాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. కుప్పంలో మహిళపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలకు సీఎం ఆదేశించారు. అప్పు తీర్చలేదని కుప్పం మండలం నారాయణపురం గ్రామంలో మహిళపై దాడి ఘటన తీవ్ర కలకలం రేపింది. మహిళను మునికన్నప్ప, అతని కుటుంబ సభ్యులు చెట్టుకు కట్టేసి అమానుషంగా వ్యవహరించారు. ఈ ఘటనపై మంగళవారం ఓ దినపత్రికలో రావడంతో ఈ విషయంపై జిల్లా ఎస్పీతో సీఎం మాట్లాడారు. నిందితుడిని ఇప్పటికే అరెస్టు చేశామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి జిల్లా ఎస్పీ తెలియజేశారు. మహిళను చెట్టుకు కట్టేసి హింసించిన వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటువంటి చర్యలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా పోలీసులు చూడాలన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉండాలని, వారి వివరాలను జిల్లా అధికారులకు అందజేయాలని సీఎం చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే బాధితులకు ఎందుకు అప్పులు అయ్యాయి అనే విషయాన్ని సేకరించి సీఎం పేషీకి పంపించాలని ఆదేశాలిచ్చారు. ఈ విషయంపై చిత్తూరు జిల్లా కలెక్టర్‌తోనూ సీఎం మాట్లాడి.. ఘటన వివరాలు పంపాలని ఆదేశాలు జారీ చేశారు. కాగా.. కుప్పం మండలం నారాయణపురానికి చెందిన మునికన్నప్ప దగ్గర అదే గ్రామానికి చెందిన తిమ్మరాయప్ప మూడేళ్ల క్రితం రూ.80 వేలు అప్పు తీసుకున్నాడు. అయితే అప్పు తీర్చలేక తిమ్మరాయప్ప తన భార్య, పిల్లలను గ్రామంలోనే వదిలేసి వెళ్లిపోయాడు. దీంతో చేసేదేమీ లేక భార్య శిరీష కూలీ పనులు చేస్తూ పిల్లలను పోషించుకుంటూ అప్పులు తీరుస్తోంది. అయితే సకాలంలో అప్పు చెల్లించలేదని మహిళ పట్ల మునికన్నప్ప, అతని కుటుంబసభ్యులు దారుణంగా



వ్యవహరించారు. మహిళను చెట్టుకు కట్టేసి హింసించారు. ఈ ఘటన జిల్లాలో సంచలనంగా మారింది. విషయం తెలిసిన పోలీసులు మునికన్నప్ప, అతడి కుటుంబసభ్యులపై కేసు నమోదు చేశారు. అప్పు తీర్చలేదని కుప్పంలో ఓ మహిళను చెట్టుకు కట్టేసి దాడి చేయడం అమానుషమని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. సభ్య సమాజం తల దించుకొనే దుశ్చర్య ఇది అంటూ వ్యాఖ్యలు చేశారు. కన్న కొడుకు ముందే తల్లికి జరిగిన ఘోర అవమానమన్నారు. సాటి మహిళగా ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. ఇలాంటి అమానవీయ ఘటనలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చూడాలని.. ఆ మహిళకు జరిగిన అవమానానికి బాధ్యత వహించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు.

# కూటమి ప్రభుత్వానికి సంబంధం ఏమిటి

## జగన్ తీరుపై ధూళిపాళ్ల మండిపాటు

**అమరావతి,జూన్ 17సమయజ్యోతి:**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై పొన్నూరు ఎమ్మెల్యే, తెలుగుదేశం సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ వల్లే బెట్టింగ్‌లో పాల్గొని కోట్లాది రూపాయలు కోల్పోయిన నాగమల్లేశ్వరరావు ఆత్మహత్య చేసుకుని చనిపోతే తమ ప్రభుత్వానికి సంబంధమెంటనీ ప్రశ్నించారు. మంగళవారం అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మీడియాతో మాట్లాడారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడక ముందు జరిగిన ఈ ఘటనకు ప్రభుత్వ వేధింపులు ఎలా కారణమవుతాయని నిలదీశారు. సత్తెనపల్లి పర్యటన దేనికోసమో స్పష్టం చేయాలని ప్రశ్నించారు. నటనలో జగన్‌కు ఆస్కార్ ఇవ్వాలని ఎద్దేవా చేశారు. జగన్ ప్రజల మీద ఇంకా దండయాత్ర చేస్తూనే ఉన్నారని ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ విమర్శించారు. జగన్ తెరలేపిన రాజకీయ శవయాత్రకు తొలి ముద్దాయి ఆయనే అని ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ విమర్శించారు. తాడేపల్లి ప్యాలెస్, జగన్ అసత్యాలు ప్రేరేపించటం వల్లే నాగమల్లేశ్వరరావు కోట్లాది రూపాయలు బెట్టింగ్‌కు పాల్పడ్డారని చెప్పారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో తనకు ఓట్లు వేయలేదనే అక్కసు, కోపం ప్రజలపై జగన్ వెళ్లగక్కుతున్నారని ధ్వజమెత్తారు. జగన్ ఇకనైనా తన పద్ధతి మార్చుకోకుంటే తాము ఇంకా నష్టపోతామని వైసీపీ నేతలు గ్రహించాలని అన్నారు. శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చే కూటమి ప్రభుత్వం అసాంఘిక శక్తులను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రోత్సహించదని కోరారు. వైసీపీని ప్రజలు 11సీట్లకే పరిమితం చేసినా జగన్ తన అరాచకత్వం ఇంకా వీడటం లేదని మండిపడ్డారు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్. మహిళలు ఓట్లు వేయలేదని, ప్రజలు తనకు ప్రతిపక్ష హోదా కల్పించలేదనే అక్కసుతోనే జగన్ వ్యవహరిస్తున్నారని ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ విమర్శించారు. నేరప్రవర్తన ఉన్నవారిని జగన్ ప్రోత్సహిస్తున్నారని ÷ర్ అయ్యారు. జగన్ తన హయాంలో ప్రభుత్వ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని నడిపారని ఆరోపించారు. జగన్ తన తీరుని ప్రశ్నించినా, పోరాడినా, విభేదించినా అక్రమ కేసులు బనాయించటంతో పాటు ప్రాణాలు హరించేలా వ్యవహరించిన తీరును ప్రజలు ఇంకా మర్చిపోలేదని చెప్పారు. ప్రజలు ఇచ్చిన తీర్పు ప్రకారం ప్రజాసమస్యలపై మాట్లాడాల్సిన జగన్ కనీసం అసెంబ్లీకి కూడా రాకపోవటం దేనికి నిదర్శనమని ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ప్రశ్నల వర్షం కురిపించారు.

# కన్నప్పలో బ్రాహ్మణులను కించపరిచే సన్నివేశాలు

## హైకోర్టులో రిట్ పిటిషన్‌పై విచారణ

## కేసును 27కు వాయిదా వేసిన హైకోర్టు

**అమరావతి,జూన్ 17సమయజ్యోతి:**



మంచు మోహన్ బాబు, మంచు విష్ణు నిర్మించి నటిస్తున్న కన్నప్ప సినిమాపై సనాతన ధర్మాన్ని, హిందూ దేవి దేవతలను, బ్రాహ్మణులను కించపరిచే సన్నివేశాలు మనోభావాలు దెబ్బతినే విధంగా చరిత్ర, పురాణాలు, వక్రీకరించి కన్నప్ప సినిమా నిర్మించారని బ్రాహ్మణ చైతన్య రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ ఏపీ హైకోర్టులో రిట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. అయితే వేసవి సెలవుల తరువాత హైకోర్టు మంగళవారం కన్నప్ప సినిమా కేసు ఏపీ హైకోర్టులో బెంచ్ మీదకి వచ్చింది. ఈ క్రమంలో సెంట్రల్ ఫిలిం బోర్డ్ ఆఫ్ సర్టిఫికేషన్ ముంబై తరఫున అడ్వకేట్ హాజరు కావడం జరిగింది. వారి తరఫున ఉన్న అడ్వకేట్ కన్నప్ప సినిమా సెన్సార్ కాకుండా గుంటూరులో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్ లో ఎన్ని అవరోధాలు అయినా సరే ఈనెల 27న సినిమా రిలీజ్ చేస్తామని తెలియజేసిన అంశంపై పత్రికల్లో వచ్చిన వార్తలను న్యాయస్థానం ముందు ఉంచారు. వెంటనే ఫిలిం సెన్సార్ బోర్డు పై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. సినిమా సెన్సార్ స్క్రూట్ని కూడా కాకుండా, సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వకుండా, హైకోర్టులో కౌంటర్ వేయకుండా సినిమా తేదీ ఎలా ప్రకటిస్తారని ప్రతివాది సెన్సార్ బోర్డ్ అడ్వకేట్ ను ప్రశ్నించారు. త్వరలో కౌంటర్ వేస్తామని సెన్సార్ బోర్డు పేర్కొంది. మిగిలిన ప్రతివాదులకు నోటీసులు అందినా ఎందుకు హాజరు కాలేదని, కౌంటర్ ఎందుకు వేయలేదని, కోర్టు, సెన్సార్ వారి అనుమతి లేకుండా సినిమా రిలీజ్ చేస్తే కోర్టు వారు చట్ట ప్రకారం ఏం చేయాలో అదే చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈనెల 27వ తేదీకి కన్నప్ప కేసును వాయిదా వేశారు. అదే రోజున ప్రపంచవ్యాప్తంగా కన్నప్ప సినిమా రిలీజ్ కానున్నట్టు ప్రకటించడం గమనార్హం.

# ఇరాన్‌తో సంబంధాలు.. ఇజ్రాయిల్‌కు మద్దతా

## కేంద్రం తీరుపై మండిపడ్డ బివి రాఘవులు

**విజయవాడ,జూన్ 17సమయజ్యోతి:**

ఇరాన్‌తో మన దేశానికి ఆర్థిక సంబంధాలు ఉన్నాయి.. కానీ, ఇజ్రాయిల్ కి భారత్ మద్దతు ఇస్తోందని, ఇదీ దారుణం అని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు.. విజయవాడలో మీడియాతో మాట్లాడిన ఆయన వివిధ అంశాలపై స్పందించారు.. పెహల్గామ్ లో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును ప్రజలకు వివరించడానికి వారం రోజులు ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నాం.. ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదుల స్థావరాలపై దాడిచేసి ధ్వంసం చేసింది.. మరి, పాకిస్థాన్, ఇండియా మధ్య యుద్ధం ఆపింది నేనే అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెబుతున్నాడు.. దీంతో, కేంద్రం ఏదో దాస్తుంది అనే అనుమానం కలుగుతుందన్నారు.. ఇజ్రాయిల్, ఇరాక్ మధ్య యుద్ధాన్ని కూడా ఆపుతామంటూ ట్రంప్ ప్రకటించారని గుర్తుచేశారు.. ఇక, గతంతో ఇందిరా గాంధీ ఎమ్జ్గ÷న్సీని గుర్తు చేసుకోవాలి.. నాటి పరిస్థితికంటే మరింత దారుణమైన పరిస్థితులు ఇప్పుడు వచ్చాయని విమర్శించారు బీవీ రాఘవులు.. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్న ఆయన.. ఇరాన్.. ఇజ్రాయిల్‌పై దాడి చేసింది.. ఈ యుద్ధం తీవ్రమైతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు దెబ్బతగులుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.. యుద్ధం నుండి వెనక్కి తగ్గాలని ఇజ్రాయిల్ పై ఒత్తిడి తీసుకుని రావాలని సూచించారు.. ఇజ్రాయిల్ కి భారత్ మద్దతు ఇస్తోంది.. ఇదీ దారుణం అన్నారు.. ఇరాన్ తో మన దేశానికి ఆర్థిక సంబంధాలు ఉన్నాయనే విషయాన్ని గుర్తుచేశారు.. ఇజ్రాయిల్ దాడిని భారత్ ఖండించాలి.. ఇప్పటికే 10శాతం క్రూడాయిల్ ధరలు పెరిగాయి.. భారత్ ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. అయితే, అమెరికా చెప్పిన విధంగా ప్రధాని మోడీ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.. పార్లమెంట్ సమావేశాలు వేసి ఈ అంశాలపై చర్చించాలి.. పార్లమెంట్ ముందు ప్రకటన చేయడం అంటే అది ప్రభుత్వ ప్రకటనగా భావిస్తాం.. పార్లమెంట్ మీద ఇంకా నమ్మకం పోలేదన్నారు.

# నేడు పల్నాడు జిల్లాలో వైసీపీ అధినేత జగన్ పర్యటన

## పరిమిత సంఖ్యలో రావాలని పోలీసుల ఆంక్షలు

**గుంటూరు,జూన్ 17సమయజ్యోతి:**

నేడు పల్నాడు జిల్లాలో వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బుధవారం పర్యటించనున్నారు.. సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో పర్యటించేందకు వెళ్లనున్నారు. ఉదయం 9.00 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల చేరుకుంటారు.. అక్కడ ఆత్మహత్య చేసుకున్న రెంటపాళ్ల ఉపసర్పంచ్ కొర్లకుంట నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శిస్తారు.. అనంతరం మధ్యాహ్నం అక్కడి నుంచి బయలుదేరి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.. అయితే, పల్నాడు జిల్లాలో జగన్ పర్యటనపై పోలీసులు ఆంక్షలు విధించారు.. పోలీసుల ఆంక్షలపై వైసీపీ నేతలు మండిపడుతున్నారు.. కూటమి ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. సత్తెనపల్లిలో జగన్ పర్యటించి తీరుతారని స్పష్టం చేశారు వైసీపీ నేతలు.. దీంతో, వైఎస్ జగన్ పల్నాడు జిల్లా పర్యటనపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.. మరోవైపు, రేపు జగన్ పర్యటనకు భారీగా వైసీపీ కార్యకర్తలు తరలివచ్చే అవకాశం ఉందని పార్టీ నేతలు చెబుతున్నారు.. కాగా, వైఎస్ జగన్ పర్యటనపై వైసీపీ నేతలు జిల్లా పోలీసుల్ని అనుమతి కోరారు.. అయితే, భారీగా జనం వస్తే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందన్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు .. వైసీపీ నేతలు అడిగిన విధంగా అనుమతి ఇవ్వలేమని స్పష్టం చేశారు. కార్యక్రమానికి పరిమిత సంఖ్యలో మాత్రమే రావాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.. దీంతో మాజీ సీఎం వైఎస్ జగన్.. పల్నాడు జిల్లా పర్యటనపై ఉత్కంఠ కొనసాగుతోంది..

# ఇంగ్లండ్‌తో పోరుకు సిద్ధమైన యువ ఆటగాళ్ళు

భారత క్రికెట్ జట్టు దాదాపు ప్రతి ఫార్మాట్ ఈ నెల నుండి ఇంగ్లాండ్‌లో పర్యటించనుంది. ఇందులో ఇండియా సీనియర్, ఇండియా అండర్-19, ఇండియా-%ూ%, మహిళల జట్టు, ఇండియా దివ్యాంగ్ జట్టు ఉన్నాయి. అయితే ఇండియా-%ూ% ప్రయాణం ఇప్పుడు ముగిసింది. జూన్ 20 నుండి ఇండియా సీనియర్ జట్టు మ్యాచ్‌లు ప్రారంభమవుతాయి. ఆ తర్వాత జూన్ 24 నుండి జూలై 23 వరకు జరిగే అండర్-19 జట్టు మ్యాచ్‌లు ప్రారంభమవుతాయి. ఈ పర్యటనకు స్పెషల్ అట్రాక్షన్ గా వైభవ్ సూర్యవంశీ, కెప్టెన్ ఆయుష్ మాత్రే. కాగా ఈ పర్యటన కోసం జట్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే సోమవారం గాయపడిన ఇద్దరు ఆటగాళ్ల స్థానంలో కొత్త ఆటగాళ్లను జట్టులో చేర్చారు. ఐపీఎల్ 2025లో చెన్నై సూపర్ కింగ్స్ తరపున అద్భుతంగా రాణించిన ఆయుష్ మాత్రే భారత జట్టుకు నాయకత్వం వహిస్తాడు. గత ఐపీఎల్లో రాజస్థాన్ రాయల్స్ తరపున 35 బంతుల్లో సెంచరీతో సహా 252 పరుగులు చేసిన 14 ఏళ్ల పేలుడు బ్యాట్స్‌మన్ వైభవ్ సూర్యవంశీ కూడా ఈ జట్టులో ఉన్నాడు. గత సంవత్సరం %ఖాజు%లో జరిగిన అండర్-19 ఆసియా కప్‌లో సూర్యవంశీ, మాత్రే భారత రన్నరప్ జట్టులో కూడా ఉన్నారు. అదే సమయంలో, వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ అభిజ్ఞాన్ కుండును జట్టు వైస్ కెప్టెన్‌గా నియమించారు. ఈ ఇండియా-ఇంగ్లాండ్ అండర్-19 మ్యాచ్ లాఫ్‌బరో విశ్వవిద్యాలయంలో 50 ఓవర్ల ప్రాక్టీస్ మ్యాచ్ అవుతుంది. ఆ తర్వాత హెూవ్, నార్తాంప్టన్ , వోర్సెస్టర్‌లలో ఐదు మ్యాచ్‌ల యూత్ వన్డే సిరీస్ ఉంటుంది. దీని తర్వాత, ఇంగ్లాండ్ అండర్-19తో రెండు మల్టీ-డే మ్యాచ్‌లు వరుసగా బెకెన్‌హామ్, చెల్మ్స్‌ఫోర్డ్‌లో జరుగుతాయి.


**భారత అండర్-19 జట్టు:**

ఆయుష్ మ్హాత్రే (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, విహాన్ మల్హోత్రా, మౌల్యరాజ్ సింగ్ చావ్డా, రాహుల్ కుమార్, అభిజ్ఞాన్ కుందు, హర్వాన్ష్ సింగ్, ఆర్ఎస్ అంబ్రిస్, కనిష్క్ చౌహాన్, హెనిల్ పటేల్, యుధాజిత్ గుహ, ప్రణవ్ రాఘవేంద్ర, మహ్మద్ ఇనాన్, అన్మోల్జిత్, డిపెప్పు, డిపెప్పు, డిపెప్పు, డిపెప్పు, డి.

**వన్డే సిరీస్ కోసం**

**ఇంగ్లాండ్ అండర్-19 జట్టు**

థామస్ రీవ్ (కెప్టెన్), రాల్ఫీ ఆల్బర్ట్, బెన్ డాకిన్స్, జాడెన్ డెన్లీ, రాకీ ఫ్లింటాఫ్, అలెక్స్ ఫ్రెంచ్, అలెక్స్ గ్రీన్, జాక్ హెూమ్, జేమ్స్ ఇస్బెల్, బెన్ మేయెస్, జేమ్స్ మింటో, ఐజాక్ మొహమ్మద్, జోసెఫ్ మూర్స్, సెబ్ మోర్గాన్, అలెక్స్ వేడ్.



# గంభీర్ ఆటగాళ్లను మేనేజ్‌చేయలేకపోతున్నాడు


ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌కు టీమిండియా సిద్ధమైంది. శుక్రవారం నుంచి లీడ్స్ వేదికగా జరిగే తొలి మ్యాచ్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. ఈ సిరీస్‌తోనే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027 ప్రారంభం కానుంది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో ఈ సిరీస్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మరోవైపు కోచ్‌గా గంభీర్‌కు ఈ సిరీస్ పరీక్షగా నిలవనుంది. గంభీర్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత టీమిండియా ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచినా.. టెస్ట్ క్రికెట్‌లో ఘోర పరాజయాలను చవిచూసింది.గంభీర్ పర్యవేక్షణలో బంగ్లాదేశ్‌తో టెస్ట్ సిరీస్ గెలిచిన టీమిండియా.. న్యూజిలాండ్‌తో సొంతగడ్డపై మూడు టెస్టుల సిరీస్‌లో క్లీన్‌స్వీప్ అయ్యింది. ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని 1-3తో కోల్పోయింది. ఈ వరుస పరాజయాలతో డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్‌ను చేజార్చుకుంది. ఈ క్రమంలోనే గంభీర్ కోచింగ్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి.తాజాగా గంభీర్ కోచింగ్ గురించి మాట్లాడిన టీమిండియా మాజీ క్రికెటర్ దినేశ్ కార్తీక్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వ్యూహాలు రచించడంలో కోచ్‌గా గంభీర్‌కు తిరుగులేదని, కానీ ఆటగాళ్లను సరిగ్గా మేనేజ్‌చేయలేకపోతున్నాడని, ఇదే అతని కోచింగ్‌లో లోపంగా మారిందన్నాడు. ఈ ఒక్క విషయాన్ని గంభీర్ సరిచేసుకోవాల్సిందన్నాడు.'వ్యూహాత్మకంగా గౌతమ్ గంభీర్ చాలా మంచి కోచ్. ఆటగాళ్లను మేనేజ్ చేసే విషయంపై అతను మరింత ఫోకస్ పెట్టాలి. కానీ అతని గురించి చెప్పాల్సిన విషయం ఏంటంటే.. తన ఆటగాళ్ల కోసం ఎదురు చూస్తాడు. అయితే కెప్టెన్‌గా దూకుడుగా ఉన్నట్లు కోచ్‌గా ఉంటానంటే కుదురదనేది నా వ్యక్తిగత అభిప్రాయం. కోచ్‌గా విభిన్నమైన వ్యక్తులను నడిపించాల్సి ఉంటుంది. వారు మెరుగైన ప్రదర్శన చేస్తారని నమ్మి మైదానంలోకి పంపించాల్సి ఉంటుంది. కోచ్‌గా ఇది అతిపెద్ద సవాల్'అని కార్తీక్ అభిప్రాయపడ్డాడు.ఇప్పటికే జట్టుపై పూర్తి ఆధిపత్యం చెలాయిస్తున్న గంభీర్.. సీనియర్ ఆటగాళ్లందర్నీ ఒక్కొక్కరిగా జట్టుకు దూరం చేస్తున్నాడనే విమర్శలు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో అతను విజయాలు సాధించకపోతే ఈ విమర్శలు మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంది.




# గిల్ చరిత్ర సృష్టించే అవకాశం!?

## 18ఏళ్ల తర్వాత ఇంగ్లండ్‌లో సిరీస్ గెలిచే చాన్స్

విరాట్ కోహ్లీ, ధోనీ టెస్టులలో భారతదేశం అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో ఒకరిగా పరిగణిస్తారు. కానీ వారు తమ సుదీర్ఘ కెరీర్‌లో ఒక్కసారి కూడా ఇంగ్లాండ్‌లో టెస్ట్ సిరీస్‌ను గెలవలేదు. టీమ్ ఇండియా చివరిసారిగా 18 సంవత్సరాల క్రితం ఇంగ్లాండ్‌లో టెస్ట్ సిరీస్‌ను గెలుచుకుంది. ఇప్పుడు 18 సంవత్సరాల తర్వాత, టెస్ట్ జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ చరిత్ర సృష్టించే అవకాశం ఉంది. గిల్ కెప్టెన్సీలో భారత్ ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడాల్సి ఉంది. ఇది జూన్ 20 నుంచి ప్రారంభం కానుంది. ఇంగ్లాండ్ సిరీస్‌లో గిల్ తొలిసారిగా కెప్టెన్‌గా ఆడనున్నాడు. అతనికి ఇది అంత సులభం కాదు. కానీ గిల్ జట్టులో కెఎల్ రాహుల్, జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా వంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్లు ఉన్నారు, మ్యాచ్ స్వరూపాన్ని మార్చే సత్తా కలిగి ఉన్న ఆటగాళ్లు వీళ్లంతా. అటువంటి పరిస్థితిలో, టీమ్ ఇండియా ఇంగ్లండ్‌కు గట్టి పోటీనిస్తుంది. ఈ జట్టు ఇంగ్లండ్‌ను ఓడించి సిరీస్‌ను కూడా గెలుచుకోవచ్చు. ఒకవేళ ఈ జట్టు అలా చేయగలిగితే, 18 సంవత్సరాల తర్వాత భారత జట్టు ఇంగ్లండ్‌లో సిరీస్‌ను గెలుచుకుంటుంది. భారత జట్టు చివరిసారిగా 2007లో ఇంగ్లండ్‌లో టెస్ట్ సిరీస్‌ను గెలుచుకుంది. అప్పుడు రాహుల్ ద్రవిడ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు.భారతదేశం, ఇంగ్లాండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ జరగనుంది. ఈ సిరీస్‌లో మొదటి మ్యాచ్ జూన్ 20 నుంచి హెడింగ్లీలో జరగనుంది. అదే సమయంలో, రెండో టెస్ట్ జులై 2 నుంచి బర్మింగ్‌హామ్‌లో ప్రారంభమవుతుంది. మూడో మ్యాచ్ జులై 10 నుంచి లార్డ్స్‌లో జరగనుంది. సిరీస్‌లో నాల్గో మ్యాచ్ జులై 23 నుంచి మాంచెస్టర్‌లో జరగనుంది. అదే సమయంలో, సిరీస్‌లో చివరి మ్యాచ్ జులై 31 నుంచి లండన్‌లోని ఓవల్‌లో జరుగుతుంది.శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీష్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాష్ దీప్, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్.ఇప్పుడు భారత క్రికెట్ కీలక దశలో ఉంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవిచంద్రన్ అశ్విన్ వంటి ముగ్గురు గొప్ప ఆటగాళ్ళు టెస్ట్ ఫార్మాట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించారు. రవీంద్ర జడేజా కూడా %ు%20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో భారత టెస్ట్ జట్టు కొత్త శకం ఆరంభం కానుంది. ఈ మార్పు దశలో జట్టు నిర్వహణ, సెలక్షన్ కమిటీ చాలా పెద్ద పాత్ర పోషిస్తాయి. ఇప్పుడు భారత క్రికెట్ నియంత్రణ మండలి (%దీజజ×%) చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలాన్ని పొడిగించాలని నిర్ణయించింది.క్రిక్‌బ్లాగర్ ప్రకారం, అజిత్ అగార్కర్ చీఫ్ సెలెక్టర్‌గా కొనసాగవచ్చని %దీజజ×% వర్గాలు తెలిపాయి. అతని పదవీకాలం పొడిగించవచ్చని సమాచారం. కానీ దానిని నిర్ధారించడానికి బోర్డు పూర్తి ప్రక్రియను అనుసరిస్తుంది.అజిత్ అగార్కర్ జూలై 2023లో చీఫ్ సెలెక్టర్‌గా సెలెక్ట్ అయ్యాడు. ఆయన ఆధ్వర్యంలో భారత జట్టు 2024 %ు%20 ప్రపంచ కప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ గెలుచుకుంది. ఈ సమయంలో భారత జట్టు 2023 %ాణ×% ప్రపంచ కప్ ఫైనల్ ఆడింది. సోర్స్ ప్రకారం అనేక అంశాలపై భారత జట్టు నిర్వహణపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేశాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల టెస్ట్ రిటైర్మెంట్‌లో ఆయన పాత్ర ఉందని కూడా చెబుతారు. ఇప్పుడు ఇంగ్లండ్ టెస్టు సిరీస్ కూడా వీళ్లందరికి కీలక మలుపుగా చెబుతారు. అందుకే కచ్చితంగా గెలవాలని కసితో బరిలోకి దిగుతున్నారు.



# 5 బంతుల్లో 5 వికెట్లు.. సత్తాచాటిన స్పిన్నర్ దిగ్వేశ్ రాఠి

లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ స్పిన్నర్ దిగ్వేశ్ రాఠి మరోసారి వార్తల్లోకెక్కాడు. అయితే ఈసారి తన అద్భుత ప్రదర్శనతో వార్తల్లో నిలిచాడు. అతడు 5 బంతుల్లోనే 5 వికెట్లు పడగొట్టి ఔరా అనిపించాడు. దీనికి సంబంధించిన వీడియోను లఖ్?నవూ ఓనర్ సంజీవ్ గొయెంకా సోషల్ మీడియాలో షేర్ చేశారు.ఒక స్థానిక టీ20 లీగ్‌లో సోమవారం జరిగిన మ్యాచ్?లో స్పిన్నర్ దిగ్వేశ్ అదరగొట్టాడు. ఈ లెగ్‌స్పిన్నర్ వరుసగా 5 బంతుల్లో 5 వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. దిగ్వేశ్ స్పిన్ మాయకు నలుగురు బ్యాటర్లు క్లీన్ బౌల్డ్ అవ్వగా, ఒక ప్లేయర్ ఎల్?బీడబ్ల్యూగా పెవిలియన్ చేరాడు. ఈ మ్యాచ్?లో నాలుగు ఓవర్ల తన స్పెల్?లో దిగ్వేశ్ 28 పరుగులిచ్చి మొత్తం 7 వికెట్లు నేలకూల్చాడు.దీంతో దిగ్వేశ్ సూపర్ పర్ఫార్మెన్స్?ను మెచ్చుకుంటూ లఖ్‌నవూ యజమాని సంజీవ్ గోయెంకా అతడి బౌలింగ్ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు.'స్థానిక టీ20 లీగ్‌లో దిగ్వేశ్ 5 బంతుల్లో 5 వికెట్లు తీసిన వీడియో ఇది. అతడికి ఇలాంటి స్కిల్స్ ఉండడం వల్లే ఐపీఎల్- 18లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తరఫున సత్తా చాటి వెలుగులోకి వచ్చాడు' అని గొయెంక రాసుకొచ్చారు. 'దిగ్వేశ్ రాఠి 5 స్టార్స్' అని లఖ్?నవూ సూపర్ జెయింట్స్? సోషల్ మీడియా ఎక్స్?లో ట్వీట్ చేసింది. కాగా, ఇటీవల ముగిసిన ఐపీఎల్?లో దిగ్వేశ్ తన ప్రదర్శనతో కంటే వివాదాలతోనే ఎక్కువగా ఫేమస అయ్యాడు. వికెట్ పడగొట్టిన అనంతరం అతడు చేసుకునే సిగ్నేచర్ సెలబ్రేషన్స్? కాంట్రవర్సీ అయ్యింది. దీంతో ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ అతడికి మూడుసార్లు ఫైన్ కూడా విధించింది. ఓవరాల్?గా ఈ సీజన్?లో దిగ్వేశ్ 13 మ్యాచ్?ల్లో 14 వికెట్లు పడగొట్టాడు. 2024లో జరిగిన మెగావేలంలో లెగ్ స్పిన్నర్? దిగ్వేశ్?ను లఖ్?నవూ సూపర్ జెయింట్స్ ఫ్రాంచైజీ రూ.30 లక్షలకు కొనుగోలు చేసింది.

# కుబేరతో అలరించనున్న ధనుష్..రష్మిక



ఎన్నో వైవిధ్యమైన పాత్రలు చేస్తూ అందరి ప్రశంసలు పొందుతున్నారు నటుడు ధనుష్. సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చి హాలీవుడ్ హీరోల ప్రశంసలు అందుకుంటున్నారు. ఆయన ప్రధానపాత్రలో నటించిన 'కుబేర' జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో ధనుష్ మ్యాష్‌అప్ వీడియోను ప్రదర్శించారు. అది చూసిన అభిమానులు గూస్‌బంప్స్ వచ్చేలా ఉందంటూ అభిప్రాయపడుతున్నారు. తాను హాలీవుడ్ సినిమాలో నటిస్తానని చెబితే ప్రజలు నవ్వేవారని ధనుష్ ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఇకపోతే ఇదే సినిమాలో రష్మిక నటించారు. నేషనల్ క్రష్‌గా గుర్తింపు తెచ్చుకొని వరుస సినిమాలతో అలరిస్తున్నారు రష్మిక. 'కుబేర'తో జూన్ 20 నుంచి సందడి చేయడానికి సిద్ధమయ్యారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆమె మ్యాష్‌అప్ వీడియో ప్రస్తుతం అందరినీ ఆకట్టు కుంటోంది. ఇందులో ఆమెపై ఇండస్ట్రీలో అగ్ర హీరోలు ప్రశంసలు కురిపించడం చూపించారు.. అలాగే తాను కెరీర్ ప్రారంభంలో ఓ ఆడిషన్ ఇస్తే రిజెక్ట్ చేశారంటూ రష్మిక ఓ ఇంటర్వ్యూలో పంచుకున్న వీడియోను ప్లే చేశారు.

# విజయ్‌సేతుపతి, పూరి సినిమా టీమ్‌లో చేరిన సంయుక్త

విజయ్ సేతుపతి హీరోగా దర్శకుడు పూరి జగన్నాథ్ ఓ సినిమా రూపొందిస్తున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో నటి సంయుక్త జాయిన్ అయినట్లు తెలుపుతూ టీమ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. ఆమె నడకలో హుందాతనం.. కళ్లల్లో ఆగ్రహం.. అంటూ సంయుక్తకు స్వాగతం పలుకుతూ ఆమెతో దిగిన ఫొటోను పంచుకున్నారు. ఇందులో ఆమె పాత్ర కీలకంగా ఉండనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ఈ సినిమాలో సీనియర్ నటి టబు భాగమైన విషయం తెలిసిందే. ఇక ఈ చిత్రానికి 'బెగ్గర్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు మొన్నటివరకూ వార్తలు వచ్చాయి. తాజాగా 'భిక్షాందేహి' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. దర్శకుడిగా విజయాన్ని అందుకునేందుకు గత కొంతకాలంగా ఎదురుచూస్తున్నారు పూరి జగన్నాథ్. ఆయన గత చిత్రాలు 'లైగర్', 'డబుల్ ఇస్మార్ట్' బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయాయి. దీంతో హిట్ అందుకోవడమే లక్ష్యంగా విజయ్ సేతుపతితో కొత్త ప్రాజెక్ట్ ప్రకటించారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక సంయుక్త వరుస ప్రాజెక్ట్‌లతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. బాలకృష్ణ హీరోగా బోయపాటి శీను దర్శకత్వంలో రానున్న 'అఖండ 2'లోనూ ఆమె భాగమయ్యారు. ఇటీవలే చిత్రబృందం ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించింది. ఇందులోనూ ఆమెది నటనకు ప్రాధాన్యమున్న పాత్రని తెలుస్తోంది.



# కర్నాటకలో థగ్ లైఫ్ విడుదలకు లైన్ క్లియర్

## అడ్డుకోవడం సరికాదంటూ సుప్రీం ఆదేశం


**న్యూఢిల్లీ,జూన్17సమయజ్యోతి:**

'థగ్ లైఫ్' చిత్ర బృందానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. కమల్‌హాసన్ నటించిన ఈ సినిమా కర్ణాటకలోనూ విడుదల చేయాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. కన్నడ భాషపై కమల్ చేసిన వ్యాఖ్యల వివాదం నేపథ్యంలో ఈ సినిమాను కర్ణాటకలో నిషేధించిన సంగతి తెలిసిందే. దీనిపై చిత్రబృందం సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. ఈ మేరకు సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యల వల్ల ఆ సినిమాను నిలిపివేయాలంటూ బెదిరించిన సంఘాలను సుప్రీం హెచ్చరించింది. అలాంటి బెదిరింపులు చట్టబద్ధం కాదన్న అత్యున్నత న్యాయస్థానం.. థియేటర్‌లలో ఏది ప్రదర్శించాలో నిర్ణయించే అధికారం ఆ సంఘాలకు లేదని స్పష్టంచేసింది. ఎవరైనా ఒక ప్రకటన చేసినప్పుడు దాన్ని మరో కామెంట్‌తో ప్రతిఘటించే స్వేచ్ఛ ఉంది కానీ.. థియేటర్‌లు తగలబెడతామని బెదిరించే అధికారం ఎవరికీ ఉండదని సుప్రీంకోర్టు వ్యాఖ్యనించింది. కర్ణాటక ప్రజలు కమల్‌హాసన్‌తో విభేదించే స్వేచ్ఛను కలిగిఉన్నారని.. అదే సమయంలో ప్రాథమిక హక్కులను కూడా కాపాడాలని కోర్టు పేర్కొంది. ఒక సినిమాకు సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత దాన్ని విడుదల చేయాల్సిందేనని సుప్రీం ఆదేశించింది. దాన్ని చూడాలా, వద్దా అనే అధికారం పూర్తిగా ప్రజలకు ఉంటుందని.. బెదిరింపుల ఆధారంగా సినిమాను ఆపకూడదని స్పష్టంచేసింది.చిత్ర నిర్మాతలు దాఖలు చేసిన పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు నుంచి తనకు బదిలీ చేసుకున్న సుప్రీంకోర్టు.. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందనను తెలియ జేయాలని ఆదేశించింది. ఈ విషయంలో నటుడు క్షమాపణలు చెప్పాల్సిందేనంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును కూడా అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది.

# రెట్రో సీరిస్ వర్షన్ విడుదలకు యోచన


తమిళ సూపర్ స్టార్ సూర్య నటించిన సూపర్ హిట్ చిత్రం రెట్రో. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహించిన ఈ రొమాంటిక్ యాక్షన్ డ్రామాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించగా, శ్రియ ప్రత్యేక గీతంలో కనిపించారు. 65 కోట్ల బ్జడెట్‌తో రూపొందిన ఈ సినిమాను సూర్య, జ్యోతిక నిర్మించారు. మే 1న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం తెలుగులో మిశ్రమ స్పందనలను అందుకోగా.. తమిళంలో మాత్రం సూపర్‌హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం ఈ చిత్రం ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర విషయాన్ని పంచుకున్నాడు దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు.నాలుగు నెలల్లో 'రెట్రో' సిరీస్ వెర్షన్ విడుదల చేయాలని తాను ఆలోచిస్తున్నట్లు సుబ్బరాజు ప్రకటించారు. ఈ ఎక్స్‌టెండెడ్ వెర్షన్‌లో కేవలం తొలగించిన సన్నివేశాలు మాత్రమే కాకుండా, అనేక భావోద్వేగపూరిత సన్నివేశాలు మరింత వివరంగా ఉండేలా ప్లాన్ వేస్తున్నానని ఆయన తెలిపారు. అయితే, ఈ విషయంలో నెట్‌ఫ్లిక్స్ సుముఖంగా లేదని, అందుకే వారితో చర్చలు జరుపుతున్నానని సుబ్బరాజు పేర్కొన్నారు. 'రెట్రో'ను కొన్ని ఎపిసోడ్‌లుగా తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నానని, ఒక్కో ఎపిసోడ్ సుమారు 40 నిమిషాలు ఉండేలా చూస్తున్నానని చెప్పారు. హాస్యం, ప్రేమ, యాక్షన్ వంటి అంశాలను ఒక్కో ఎపిసోడ్‌లో హైలైట్ చేయాలనేది తన ఆలోచన అని సుబ్బరాజు వెల్లడించారు.




# ఢీ సీక్వెల్‌కు నేను రేఢీ అంటున్న మంచు విష్ణు

తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు మంచు విష్ణు. జూన్ 27న ఈ సినిమా విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో విష్ణు తన హిట్ సినిమా 'ఢీ' సీక్వెల్ గురించి మాట్లాడారు. 'ఢీ' సినిమా సీక్వెల్ గురించి మాట్లాడుతూ.. 'ఆ సినిమా దర్శకుడు, నేను కలిసి సీక్వెల్ కోసం ప్రయత్నిస్తున్నాం. నేను ఆ చిత్రాన్ని ఎంతో ప్రేమతో చేశాను. ఏదో ఒకరోజు దర్శకుడు దాని సీక్వెల్ స్క్రిప్ట్‌తో నన్ను కలవాలని కోరుకుంటున్నాను. అదంతా రచయిత చేతుల్లోనే ఉంటుంది. స్క్రిప్ట్ సిద్ధమైన మరుసటి రోజే దాని షూటింగ్‌ను ప్రారంభిస్తాను' అని మంచు విష్ణు తెలిపారు.శ్రీను వైట్ల దర్శకత్వంలో విష్ణు, జెనీలియా జంటగా నటించిన యాక్షన్ కామెడీ ఫిల్మ్ 'ఢీ'. శ్రీహరి, జయప్రకాశ్‌రెడ్డి, బ్రహ్మానందం కీలక పాత్రలు పోషించారు. 2007లో వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడమే కాకుండా, మంచు విష్ణు కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్‌లో ఒకటిగా నిలిచింది. అలాగే తన మనసులో ఉన్న మరో కథను కూడా బయటపెట్టారు. ప్రస్తుతం తాను 'కన్నప్ప' ప్రచారంలో బిజీగా ఉన్నట్లు చెప్పిన విష్ణు.. వేరే సినిమాలు ప్లాన్ చేయడం లేదని వెల్లడించారు. అయితే, 1947 నేపథ్యంలో సాగే పీరియాడిక్ సినిమా చేయాలని తనకు ఎప్పటినుంచో ఆలోచన ఉందన్నారు. ఆ ఆలోచనను నిజం చేయడం కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. గతేడాది విడుదలై హిట్‌ను సొంతం చేసుకున్న ఫహద్ ఫాజిల్ 'ఆవేశం' సినిమా తెలుగు రీమేక్ చేయాలని అనుకున్నట్లు మంచు విష్ణు చెప్పారు. అయితే, అప్పటికే ఆ సినిమా రైట్స్ మరొకరు సొంతం చేసుకున్నారని అన్నారు.




EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685